


# విజయభాను




విశాఖపట్నం, మంగళవారం 12-12-2017 VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION సంపుటి : 41 సంచిక : 89 పేజీలు : 8 వెల : 1 రూపాయి



## రగులుతున్న రాజకీయవేడి

### ప్రచారజోరుతో రద్దీలు

### మోదీ, రాహుల్ రోడ్‌షోలకు నో

అహ్మదాబాద్: గుజరాత్‌లో రాజకీయ వేడి రగులుతూనే ఉంది. ఇప్పటికే రాష్ట్రంలో శాసనసభ తొలిదశ ఎన్నికలు పూర్తికాగా డిసెంబర్ 14న చివరి దశ పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో అటు అధికార భాజపా, ఇటు ప్రతిపక్ష కాంగ్రెస్ ప్రచార జోరు పెంచాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కాంగ్రెస్ తరువాయి 2లో

## కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాహుల్ ఎన్నిక ఏకగ్రీవం

### పార్టీ నేతలు, కార్యకర్తల్లో అత్యుత్సాహం

### డిసెంబర్ 16న పార్టీ అధ్యక్ష బాధ్యతల అప్పగింత

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా యువనేత రాహుల్ గాంధీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల పర్యవేక్షకులు ముల్లప్పల్లి రామచంద్రన్ సోమవారం ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. దీంతో పార్టీ నేతలు, కార్యకర్తలు బాణాసంచా కాలుస్తూ, స్వీట్లు పంచుకుంటూ సంబరాల్లో తరువాయి 2లో



## పోలవరాన్ని అడ్డుకుంటే చూస్తూ ఊరుకోం

- కాంక్రీటు పనుల వేగవంతానికి చర్యలు
- ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి రాజీ పడబోం
- లెక్కలు చెబుతున్నాంగా.. శ్వేతపత్రం ఎందుకు?
- విహంగవీక్షణంలో సీఎం బాబు





పోలవరం: ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును గడువు లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు.

ప్రతి సోమవారం పోలవరంపై సమీక్ష నిర్వహిస్తున్న చంద్రబాబు సోమవారం ప్రాజెక్టును సందర్శిం చారు.

విహంగ వీక్షణం ద్వారా కాపర్ డ్యామ్, డయాఫ్రం వాల్ పనులను పరిశీలించారు. పనుల తీరును ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడు ముంపు మండ లాలు రాకపోతే పోలవరం మన వూహకు కూడా అందేది కాదు. కాంక్రీటు పనుల వేగవంతానికి చర్యలు తీసు కుంటున్నాం. కాపర్ డ్యామ్ నిర్మాణం పూర్త యితే గ్రావిటీ ద్వారా నీరం దిస్తాం. పునరావాస ప్యాకేజీ వల్ల ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.54వేల కోట్లకు చేరుకుంది. పోలవరం తరువాయి 2లో



## 28, 29, 30 తేదీల్లో విశాఖ ఉత్సవ్

- 16, 17, 18 తేదీల్లో టెక్ కాన్ఫరెన్స్
- హాజరుకానున్న 3 దేశాల విద్యాశాఖ మంత్రులు
- 16న హెలీ టూరిజం ప్రారంభం
- 23న ఇన్‌ఛార్జి మినిస్టర్ సమీక్ష
- డిసెంబర్ నెలంతా వేడుకలే
- మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడి



విశాఖపట్నం : ప్రజా పండుగగా విశాఖ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నామని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 28, 29, 30 తేదీలలో విశాఖ ఉత్సవాన్ని వైభవంగా జరపనున్నామని అన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ పండగలలో నగరంలో ఉత్తమ అలంకరణ గావించిన సంస్థలకు, హెూటళ్లకు లక్కీడిప్ ద్వారా ప్రత్యేక బహుమతులను అందజేయడం జరుగుతుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, యునెస్కో సంయుక్తంగా విశాఖపట్నంలో టెక్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించ నున్నట్లు మంత్రి గంటా తెలిపారు. తరువాయి 2లో

## ఆర్థిక వేత్తలతో ప్రీ బడ్జెట్ మీటింగ్



న్యూఢిల్లీ: బడ్జెట్ సమావేశాలకు ముందు కేంద్రం కీలక సమావేశం నిర్వహించింది. పలు ఆర్థిక వేత్తలు, నిపుణులతో ఆర్థికమంత్రిత్వ శాఖ ప్రీ బడ్జెట్ సమావేశాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సోమవారం బడ్జెట్ సమావేశానికి హాజరయ్యారు.

రాబోయే 2018 కేంద్ర బడ్జెట్ కరసరత్తులో భాగంగా ఆర్థికవేత్తల బృందంతో సమావేశ మైంది. రెవెన్యూ కార్యదర్శి హస్ముక్ ఆదియా కూడా ఉన్నారు. గతంలో తరువాయి 2లో




## విజయ్‌సాయి ఆత్మహత్య కేసులో కొత్త ట్విస్ట్

వార్త 2వ పేజీలో..

## బాబు పాలనలో అభివృద్ధి శూన్యం



### చంద్రబాబుపై కామెంట్లు

### వైకాపా ఎమ్మెల్యే రోజా

పలమనేరు: అధికార పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడే వైసీపీ ఎమ్మెల్యే రోజా మరోసారి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై తీవ్ర విమర్శలు చేశారు. పలమనేరులో వైసీపీ కార్యాలయాన్ని ప్రారంభించిన తరువాయి 2లో




## డయల్ యువర్ కలెక్టర్‌కు 16 ఫోన్ కాల్స్

- రెవెన్యూ శాఖకు సంబంధించినవి 8
- కాలుష్య నియంత్రణ మండలికి సంబంధించినవి 2
- ఇతర శాఖలకు సంబంధించినవి 6




విశాఖపట్నం : సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి 16 ఫిర్యాదులు ఫోన్ కాల్స్ ద్వారా అందాయి. వీటిలో 8 ఫోన్ కాల్స్ రెవెన్యూ శాఖకు సంబంధించినవి కాగా, రెండు ఫోన్ కాల్స్ కాలుష్య నియంత్రణ మండలివి, మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి.

గాజువాక 59వ వార్డు నుండి వచ్చిన ఫిర్యాదులో, తమ వార్డు పరిధిలో కాస్టింగ్ పరిశ్రమ ఉందని, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఆ పరిశ్రమన జివిఎంసి అధికార్లు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికార్లు మాయించారని, విద్యుత్ సరఫరా నిలిపివేశారని, అయినా, పరిశ్రమ యజమాని నిబంధనలు ఉల్లంఘించి విద్యుత్ జనరేటర్‌తో పరిశ్రమను నడుపుతున్నారని తెలిపారు. దీనివలన ఆ ప్రాంతంలో దుమ్ము, ధూళి, శబ్ద కాలుష్యం పెరిగి కాలనీలో మనుగడ కష్టంగా ఉందని, వెంటనే ఆ పరిశ్రమపై చర్యలు చేపట్టాలన్నారు.

వెంటనే ఆ పరిశ్రమపై చర్యలు తీసుకుంటామని అధికార్లు హామీ ఇచ్చారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన ఫిర్యాదుల్లో ఎక్కువ భాగం ప్రభుత్వ భూములు కబ్జాకు సంబంధించినవి కావడం విశేషం.

సోమవారం జరిగిన డయల్ యువర్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా తరువాయి 2లో

# విజయ్‌సాయి ఆత్మహత్య కేసులో కొత్త ట్విస్ట్



- సెల్ఫీ వీడియోలో పలువురిపై తీవ్ర ఆరోపణలు
- ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో తెలియదు: వనిత
- సమస్యలుంటే 'మా'తో చెప్పుకోవాలి: శివాజీరాజా

హైదరాబాద్: హాస్యనటుడు విజయ్ సాయి ఆత్మహత్య కేసు మరో కీలక మలుపు తీసుకుంది. హైదరాబాద్ యూసఫ్‌గూడలోని తన నివాసంలో విజయ్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు అన్ని కోణాల్లో కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు ముందు విజయ్‌సాయి సెల్‌ఫోన్‌లో తీసుకున్న సెల్ఫీ వీడియోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరువు, మానసిక వేదనతోనే ఆత్మహత్య చేసుకున్నట్టు విజయ్ వీడియోలో తెలిపారు. భార్య వనిత ప్రవర్తన, ఇతరుల వేధింపుల కారణంగానే తాను ఈ నిర్ణయం తీసుకున్నానని విజయ్ అందులో పేర్కొన్నారు. తన చావుకు భార్య వనిత, వరలక్ష్మి, విన్నీ, బృందతోపాటు పారిశ్రామికవేత్త శశిధర్, న్యాయవాది శ్రీనివాస్ కారణమని ఆరోపించారు. వీరంతా తనను మానసికంగా హింసించారని విజయ్ సాయి ఆవేదన వ్యక్తం చేశారు. డాడీ.. ఎవ్వర్నీ విడిచిపెట్టొద్దు. అందరికి శిక్ష పడేలా చూడు.. లవ్ యూ డాడీ.. నా కూతురు అలాంటి వాతావరణంలో పెరగడం ఇష్టంలేదు.. తీసుకొని రండి డాడీ అని విజయ్ సాయి సెల్ఫీ వీడియోలో అన్నారు.

***ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో తెలియదు: వనిత***

తన భర్త విజయ్‌సాయికి ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందో తనకు తెలియదని ఆయన భార్య వనిత తెలిపారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ.. విజయ్‌కి వేరే మహిళతో సంబంధం ఉంది. ఆ విషయం నేను కళ్లారా చూశాను. అప్పటి నుంచే మా మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ విషయాన్ని ఆయన తల్లిదండ్రులు దృష్టికి తీసుకెళ్తే వారు కూడా పట్టించుకోలేదు. రెండేళ్లుగా కోర్టులో విడాకుల కేసు నడుస్తోంది. సూసైడ్ చేసుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందో నాకు తెలియదు. పాప విషయంలో కూడా నేను ఎలాంటి జోక్యం చేసుకోలేదు.

అప్పుడప్పుడు వచ్చి పాపను తీసుకెళ్లి మళ్లీ తీసుకొస్తుండేవారు. అయితే పెళ్లి సమయంలో నేను ఏదైతే ఇచ్చానో దాన్ని తిరిగి ఇవ్వమని కోరాను. ఎందుకంటే పాప భవిష్యత్‌ను కూడా నేను చూసుకోవాలి కదా అని చెప్పుకొచ్చారు.

***దయచేసి ఇలాంటి నిర్ణయాలొద్దు: శివాజీరాజా***

హాస్య నటుడు విజయ్ ఆత్మహత్య ఘటనపై సినీ నటులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. పలువురు నటులు విజయ్ కుటుంబ సభ్యులను పరామర్శించి తమతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా హాస్యనటుడు ధన్‌రాజ్ మాట్లాడుతూ.. విజయ్ అమ్మ పరిస్థితి చూస్తే చాలా బాధేస్తోంది. సినిమాల్లో అవకాశాల్లేక ఇలాంటి తీవ్రమైన నిర్ణయం తీసుకున్నాడంటే నేను నమ్మను. ప్రస్తుతం విజయ్.. అల్లరి నరేష్ సినిమాలో నటిస్తున్నాడు. ఇంకా మరో రెండు, మూడు సినిమాలు చేస్తున్నాడు. ఎందుకు ఇలాంటి నిర్ణయం తీసుకున్నాడో తెలియడంలేదు. పోలీసులు విచారిస్తున్నారు. ఇలా మమ్మలందరినీ వదిలి వెళ్లిపోవడం తప్పు అని అన్నారు.

***సమస్యలుంటే 'మా'తో చెప్పుకోవాలి***

ఏవైనా సమస్యలుంటే 'మా'తో చెప్పుకోవాలన్నారు. అలా కాకుండా ఇలాంటి తీవ్రమైన నిర్ణయాలు తీసుకోవడం వల్ల నటులపై ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్తాయన్నారు. దయచేసి ఆత్మహత్యలు లాంటి నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. గతంలో రంగనాథ్ ఆత్మహత్య చేసుకున్న సమయంలోనూ తాను ఇదే విధమైన విజ్ఞప్తి చేసినట్టు ఆయన గుర్తుచేశారు. సీనియర్ నటుడు సురేష్ మాట్లాడుతూ.. ఒక్క సెకనులో తీసుకున్న నిర్ణయంతో ఆ కుటుంబానికి తీవ్ర నష్టం జరుగుతోందన్నారు.మానసిక ఒత్తిళ్లకు గురైతే అవసరమైన మానసిక స్థైర్యాన్నిచ్చేలా కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. అంతేకాకుండా నటీనటులకు మా చేయూతనిస్తోందని తెలిపారు.

### రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్-2017 లో

## అండిబోయిన లక్ష్మికి బంగారు పతకాలు



గాజువాక: 38వ రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2017 పోటీలలో గాజువాక ప్రాంతానికి చెందిన ప్రముఖన్యాయవాది, అథ్లెటిక్ అండిబోయిన లక్ష్మి మూడు బంగారు పథకాలను సాధించారు. ఈ నెల 8,9 తేదీలలో నెల్లూరులో జరిగిన 38వ రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2017 పోటీలలో పరుగు పందెంలో ఆమె సత్తా చాటారు. 200,400,800 మీ. పరుగు పందెం పోటీలలో ఆమె పాల్గొని ఉత్తమ ప్రతిభకనబర్చి మూడు బంగారు పథకాలను సాధించారు. అంతే కాకుండా 400మీ రిలే పరుగు పందెం పోటీలలో కూడా స్వర్ణపథకం సాధించారు. రాష్ట్రంలోని 8జిల్లాల నుంచి అథ్లెటిక్స్ పాల్గొన్న ఈ పోటీలలో బంగారు పథకాలతో ఆమె సత్తాచాటారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో నెల్లూరు ఎమ్మెల్యే అనిల్‌కుమార్ చేతుల మీదుగా ఆమెకు ప్రశంసా పత్రాలను, బంగారు పథకాలను ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర రాజధాని నిర్వాహణ కమిటీ సభ్యులు బీద మస్తాన్‌రావు, ఎపి అథ్లెటిక్స్ జనరల్ సెక్రెటరీ మంగవరప్రసాద్, బి.సి. సెల్ నాయకుడు అండిబోయిన అప్పారావు అభినందనలను తెలిపారు. గాజువాకలోని ఆమె స్వగృహం వద్ద కలిసిన క్రీడాభిమానులు అభినందనలతో ముంచెత్తారు.

## వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో అవకతవకలు



అచ్యుతాపురం: వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో అవకతవకలు జరిగాయని మత్స్యకార గ్రామమైన పూడిమడక గ్రామస్తులు సోమవారం ఎమ్‌డిఒ పి.బలరాముడుకు పిర్యాదు చేసారు. పూడిమడక గ్రామానికి మంజూరైన 800 వ్యక్తిగత మరుగుదొడ్లలో సుమారు 100 నుండి 150 వరకూ మరుగుదొడ్ల నిర్మాణం చేయకుండానే నగదు డ్రా చేసుకున్నట్లు తెలిపారు. ఈ వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో మరుగుదొడ్లు నిర్మించుకున్న వారికి 10 వేలు రూపాయలు ఇవ్వగా మరి కొంత మందికి 5 వేలు రూపాయలు ఇస్తున్నారని, ఇంకొంత మందికైతే ఇప్పటి వరకూ నగదు చెల్లించలేదన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పిర్యాదులో పేర్కొన్నారు. పిర్యాదు ఇచ్చిన వారిలో వాసుపల్లి శ్రీనివాసరావు, చేపల శ్రీరాములు, సి.హెచ్.ఎర్రినాయుడు తదితరులు ఉన్నారు.

## స్కూల్ బ్యాగులు, బెల్ట్స , టైలు పంపిణీ

భీమునిపట్నం : మండలం రేఖవానిపాలెం ప్రాధమిఖ పాటశాలలో టీచర్స్ హెల్ప్ గ్రూప్ వారు పాటశాలలోని విధ్యార్ధులకు స్కూల్ బ్యాగులు ,బెల్టు టైలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమం కు మండల పరిషత్ అధ్యక్షురాలు యరబాల.క్రిష్ణవేణి ముఖ్య అతిదిగా వచ్చారు .ఆమె మాట్లాడుతూ చదవు మనిషి కి జ్ఞానం ను ఇస్తుందని ప్రభుత్వ పాటశాలలో ఉండే సదుపాయాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ,పాటశాలాలకి మౌలిక సదుపాయాలను సమకూర్చడానికి టీచర్స్ హెల్ప్ గ్రూప్ వారు చేసే కృషిని అభినందించారు.ఈ కార్యక్రమాణిక రేఖవానిపాలెం పంచాయితీ సర్పంచ్,వైస్ సర్పంచ్ శ్రీవాసరావు మురళి , టీచర్స్ హెల్ప్ గ్రూప్ సబ్యులు కె.ముత్యాలరావు,మోహన్ ,కుమార్ ,ఏస్.ఎం.సి చైర్మెన్ అనూరాధ ,ఉపాధ్యాయులు ,సి.హెచ్.రాణి,గ్రూప్ వ్యవస్థాపకుడు రామకృష్ణ తదితరులు పాలుగున్నారు .

## 19న ద్రోణంరాజు జయంతి వేడుకలు

### ఉత్తరాంధ్ర కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

విశాఖపట్నం : దివంగత రాజ్యసభ సభ్యులు, కాంగ్రెస్‌పార్టీనేత ద్రోణంరాజు సత్యనారాయణ 85వ జయంతి పురస్కరించుకొని ఉత్తరాంధ్ర జిల్లాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని ఈ నెల 19న అక్కయ్యపాలెం పోర్ట్ కళావాణి ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఉదయం దసపల్లా హొటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి పాండిచ్చేరి ముఖ్యమంత్రి వి. నారాయణస్వామి ముఖ్య అతిధిగా పాల్గొంటారని తెలిపారు. డాక్టర్ ఎన్. రఘువీరారెడ్డి అధ్యక్షత వహిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు డాక్టర్ టి. సుబ్బరామిరెడ్డి, డాక్టర్ కేవిపి రామచంద్రరావు, పాండిచ్చేరి రాష్ట్ర మంత్రి మల్లాడి క్రిష్ణారావు, కేంద్రమంత్రులు ఎం పల్లంరాజు, కిల్లి కృపారాణి తదితర పార్టీ నాయకులు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో ఎఐసిసి అధ్యక్షునిగా ఎన్నికవుతున్న రాహుల్‌గాంధీ నాయకత్వానికి మద్ధతు తెలియజేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం, ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ప్యాకేజి కోసం ప్రభుత్వాలకు నివేదిస్తామన్నారు. ఈ సమావేశం లో కాంగ్రెస్ నాయకులు, మాజీ మంత్రులు పి బాలరాజు, కొండ్రుమురళీ, ఎమ్మెల్సీ విశ్వప్రసాద్, డాక్టర్ రాంమోహన్, బెహరా భాస్కరరావు, పేడాడ రమణికుమారి, కంటూముచ్చు తాతారావు, సత్యనారాయణ, కందుల నాగరాజు, కొప్పుల వెంకటరావు, భాషా, యడ్ల ఆదిరాజు, డోలా జగన్ తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల పాలిట వరం చంద్రన్న బీమా



అచ్యుతాపురం: పేద ప్రజల పాలిట చంద్రన్న భీమా పథకం వరమని ఎమ్‌పిటిసి గుడివాడ సుదాలతా జయకుమార్ అన్నారు. కొండకర్లలో ఇటివలే ఇల్లా వెంకటలక్ష్మి మృతి చెందటంతో చంద్రన్న భీమా పథకంలో బాగంగా మృతురాలి భర్త దేముడుకు 5,000 రూపాయలు సోమవారం ఎమ్‌పిటిసి అందజేసారు. మిగిలిన 1,95,000 రూపాయలు త్వరలోనే అందజేస్తామని తెలిపారు.

## 23న కాకినాడలో అందాల పోటీలు

### 13,14 తేదీలలో ఎంపికలు ...మిస్ వరల్డ్ ఆస్ట్రేలియా ఎస్మావోల్డర్ రాక




కాకినాడ : మహిళలు యువతులలో సృజనాత్మకత వెలికి తీసేలా ఈ నెల 23న కాకినాడలో తొలిసారిగా అందాల పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలుగు ప్రిన్సెస్ సంస్థ నిర్వాహకురాలు శిరీష వెల్లడించారు. పూర్తిగా తెలుగువారికే పరిమితమైన ఈ పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఈనెల 13,14 తేదిలలో కాకినాడ ఎన్ఎఫ్‌సిఎల్ రోడ్డులోగల జికన్వెన్షన్ హాలు నందు ఎంపికలు చేస్తామన్నారు.ఈనెల 23న జరిగే ఫైనల్ పోటీలకు వరల్డ్ ఆస్ట్రేలియా ఎస్మావోల్డర్ ఆసియా ఫసిఫిక్ సుధా జైన్‌లు హజరవుతారన్నారు.ఈ పోటీలలో గెలుపొందిన యువతుల ప్రతిభను జాతీయ ,అంతర్జాతీయ స్ధాయిలలో తెలియ జేయడంతోపాటు మోడలింగ్ రంగాలలో కూడా పరిచయం చేస్తామన్నారు.మూడు రోజుల శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవెంట్ మేనేజర్ నాగార్జున్,కో-ఆర్డినేటర్‌శివ,వైష్ణవి ,పృధ్వీరాజ్,తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## డయల్ యువర్ కలెక్టర్‌కు 16 ఫోన్ కాల్స్

కలెక్టర్ ప్రవీణ్ కుమార్, జాయింట్ కలెక్టర్ సృజన, జాయింట్ కలెక్టర్-2 శిరి, డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

***డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి సకాలంలో రాని అధికార్లపై జాయింట్ కలెక్టర్ ఆగ్రహం***

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి సకాలంలో హాజరు కాని అధికార్లపై జాయింట్ కలెక్టర్ సృజన ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనుంచి ప్రతి సోమవారం ఉదయం 10.15 గంటలకు అన్ని ద్వారాలు మూసివేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వారు ప్రతి రోజూ 9.30 గంటల వరకు ముఖ్యమంత్రితో టెలికాన్ఫరెన్స్‌లో ఉంటారని, మిగతా అధికార్లకు వేరే సమీక్షలు ఉండవు కావున ఎట్టి పరిస్థితులలోనూ వారు 10గంటలకల్లా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరుగు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి, తదుపరి మీకోసం కార్యక్రమానికి హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

## కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాహుల్ ఎన్నిక ఏకగ్రీవం

మునిగిపోయారు. ఎన్నిక ప్రక్రియలో భాగంగా రాహుల్.. ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో గత సోమవారం (డిసెంబర్ 4) నామినేషన్ వేసిన సంగతి తెలిసిందే. సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ తదితర సీనియర్ నేతలు ఆయన నామినేషన్‌ను ప్రతిపాదించారు. అధ్యక్ష పదవి పోటీకి నామినేషన్ గడువు ఈ సోమవారం (డిసెంబర్ 11)తో ముగిసింది. ఇప్పటివరకూ ఈ పదవికి రాహుల్ మినహా మరెవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రామచంద్రన్ ప్రకటించారు. ఈ పదవికి ఎన్నికైనట్లు రాహుల్‌కు ధ్రువపత్రం అందజేయనున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష బాధ్యతలను రాహుల్ గాంధీ డిసెంబర్ 16న చేపట్టనున్నట్లు సమాచారం. సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ తదితర సీనియర్ నేతల సమక్షంలో ఆయన ఈ పదవిని స్వీకరిస్తారు. నెహ్రూ కుటుంబం నుంచి కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న ఆరో వ్యక్తిగా రాహుల్ నిలవనున్నారు.

## రగులుతున్న రాజకీయవేడి

ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ మంగళవారం అహ్మదాబాద్‌లో వేర్వేరుగా పర్యటించాలని ప్రణాళిక వేసుకున్నారు. అయితే వారి ప్రచారజోరుకు స్థానిక పోలీసులు బ్రేక్ వేశారు. ఇద్దరి రోడ్‌షోలకు అనుమతి నిరాకరించారు. శాంతి భద్రతల దృష్ట్యా రోడ్‌షోలను అనుమతి ఇవ్వట్లేదని పోలీసు వర్గాలు వెల్లడించాయి. రెండు రోడ్‌షోలూ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురయ్యే అవకాశముందని, అందుకే అనుమతి ఇవ్వట్లేదని పోలీసు ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. రెండో దశ ఎన్నికల ప్రచారానికి మంగళవారం చివరిరోజు. దీంతో అవాంఛనీయ ఘటనలు జరిగే ప్రమాదముందని అధికారులు అనుమానిస్తున్నారు. ముందుజాగ్రత్త చర్యగాఆయా ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే భాజపా, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ ప్రధాని మోదీపై చేసిన అవమానకర వ్యాఖ్యలతో వివాదం రేకెత్తింది. ఆయన వ్యాఖ్యలపై మోదీ సహా భాజపా నేతలు మండిపడ్డారు. మరోవైపు గుజరాత్ ఎన్నికల్లో పాకిస్థాన్ జోక్యం చేసుకుంటోందని ప్రధాని మోదీ ఆరోపిస్తున్నారు.

## పోలవరాన్ని అడ్డుకుంటే చూస్తూ ఊరుకోం

ప్రాజెక్టుపై ప్రతిపక్షం అపోహలు సృష్టించి అడ్డుకోవాలని చూస్తోంది.ప్రతి సోమవారం ప్రాజెక్టుకు సంబంధించి పూర్తి వివరాలు అందిస్తున్నాం. రోజువారీ లెక్కలు చెబుతుంటే మళ్లీ శ్వేతపత్రం ఏమిటి?. ప్రాజెక్టును అడ్డుకోవద్దని విపక్షాలను కోరుతున్నా. ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి రాజీ పడబోం. అడ్డుకుంటే చూస్తూ వూరుకోం అని హెచ్చరించారు.

## ఆర్థిక వేత్తలతో ప్రీ బడ్జెట్ మీటింగ్

వ్యవసాయ రంగం, పరిశ్రమ, వ్యాపార విభాగాలు, ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులతో ఆర్థిక మంత్రి సమావేశమయ్యారు. ముఖ్యంగా కార్పొరేట్ పన్ను తగ్గింపు తదితర కీలక అంశాలపై ఈ సమావేశం చర్చించింది. మరోవైపు 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎన్‌డీఏ ప్రభుత్వ చివరి ఆర్థిక బడ్జెట్ కావడంతో భారీ పెట్టుబడులు, తక్కువ పన్నులు, మరిన్ని ప్రోత్సాహకాలతోఆకర్షణీయంగా బడ్జెట్‌ను వడ్డించేందుకు కేంద్రం సన్నద్ధమవుతోంది.

## 28, 29, 30 తేదీల్లో విశాఖ ఉత్సవ్

డిసెంబర్ నెలలో జరపనున్న ఈవెంట్లపై మంత్రి సోమవారం జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, ఇతర అధికారులతో సమీక్షించిన అనంతరం ప్రభుత్వ అతిధి గృహంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 16,17,18 తేదీలలో నొవొటెల్ నందు నిర్వహించే టెక్ కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరు కానున్నారని తెలిపారు. మలేషియా, నేపాల్, యుఎఇ దేశాలకు చెందిన విద్యాశాఖ మంత్రులు, 200 మంది విదేశీ ప్రతినిధులు, 800 వరకూ స్థానిక ప్రజాప్రతినిధులు, ముగింపు రోజున కేంద్ర మంత్రి సుజనా చౌదరి హాజరు కానున్నట్లు వివరించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ టెక్ కాన్ఫరెన్స్ విద్యార్థులకు ఉపకరించేలా వుంటుందని అన్నారు. ఈ సదస్సులో అన్ని యూనివర్శిటీల వీసీలు హాజరవుతారని తెలిపారు. ఈ నెల 16న హెలీటూరిజంను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని అన్నారు. విశాఖపట్నంలో పర్యాటకాభివృద్ధికోసం పర్యాటక శాఖ, విశాఖ పోర్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు పాసింజర్ షిప్పులను శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇస్తాంబుల్ నుండి రెండు యూటింగ్ బోట్లను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నిమ్మకాయల చినరాజప్ప అధ్యక్షతన ఈ నెల 23న జిల్లా సమీక్షా సమావేశం జరుగుతుందని, అన్ని శాఖలు, జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులతో సమగ్రంగా సమీక్ష నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో పర్యాటక అధికారి పూర్ణిమా దేవి హాజరైనారు.

## బాబు పాలనలో అభివృద్ధి శూన్యం

అనంతరం జరిగిన సభలో రోజా ప్రసంగిస్తూ సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే అమర్‌నాథ్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రాన్ని ఎప్పుడూ నెంబర్ వన్‌గా చేస్తానని ప్రకటించే చంద్రబాబు చేసిన అభివృద్ధి శూన్యమని పేర్కొన్నారు. అంతే కాదు ఎయిడ్స్‌లోనూ, మహిళ అక్రమ రవాణాలోనూ ఏపీ మొదటిస్థానంలో ఉందని, ఇవి నేను అంటున్న మాటలు కాదని ఆయన మిత్రుడు ఆంధ్రజ్యోతి, ఈనాడు చెప్పినవేనని ఎద్దేవా చేశారు. ప్రపంచంలోనే నెంబర్ వన్ అవినీతి ముఖ్యమంత్రి చంద్రబాబు అని ఎన్సీఆర్ రిపోర్ట్ వెల్లడించిందని అన్నారు. బాల్య వివాహాల్లోనూ మొదటి స్థానంలో ఉందని, పనికొచ్చిన విషయాల్లో కాకుండా పనికిరాని విషయాల్లో ఏపీని ముందు వరుసులో నిలబెట్టారంటే అంటే ఆయన పరిపాలన ఎలా ఉందో అర్థం చేసుకోవాలని దుయ్యబట్టారు. నాకు ఉంగరం లేదు, వాచీ లేదు అంటూ దొంగ ఆస్తులు, ప్రకటనలు చేసే వీళ్లు దేశంలోనే ధనవంతుల్లో మొదటి సీఎంలో చంద్రబాబు అని డిక్లేర్ చేశారంటే వారి అవినీతి ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవాలని సూచించారు.

***పవన్‌పై జగన్ పరోక్ష విమర్శలు***

***ప్రజాసంకల్పయాత్రలో పవన్‌పై జగన్ పరోక్ష విమర్శలు***

కొంత విరామం అనంతరం తన అభిమానులతో సమావేశాలు నిర్వహించి, తెలుగుదేశం అధినేత చంద్రబాబుకు మద్దతుగా మాట్లాడిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ పై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరోక్షంగా విమర్శలు చేశారు. ఇప్పటికే పవన్ కల్యాణ్ పై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు విరుచుకుపడుతూ ఉండగా.. పాదయాత్రలో ఉన్న జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు ఒక సినీ యాక్టర్ ను పక్కన పెట్టుకుని వస్తున్నారు.. అని వ్యాఖ్యానించారు. పవన్ పేరును ప్రస్తావించకుండానే.. సినీ యాక్టర్ అని అంటూ జగన్ పవన్ ప్రస్తావన తీసుకొచ్చారు. తనను ప్రజలు మళ్లీ నమ్మరని చంద్రబాబుకు అర్థం అయిపోయింది. అందుకే ఈ సారి సినీ యాక్టర్ ను పక్కన పెట్టుకుంటాడు. ఆ యాక్టర్.. చంద్రబాబు అన్నీ చేస్తాడు.. తనదీ పూచీ అని అంటాడు. బాబుకు ఓట్లేయమంటాడు. జాగ్రత్తగా ఉండకపోతే వారి అబద్ధాలకు అంతే ఉండదు.. అని జగన్ వ్యాఖ్యానించారు. ఓట్ల కోసం కపట ప్రేమను చూపించే ఇలాంటి వారిని క్షమించకూడదని జగన్ అన్నారు. అనంతపురం జిల్లా కూడేరులో జరిగిన సభలో జగన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక జగన్ పాదయాత్ర నేటితో 32వ రోజుకు చేరుకుంది. అనంతపురం జిల్లాలోని ఉరవకొండ నియోజకవర్గంలో పాదయాత్రను పూర్తి చేసిన జగన్ ఇదే జిల్లాలోని రాప్తాడు నియోజకవర్గంలోకి ప్రవేశించారు. మంత్రి పరిటాల సునీత ప్రాతినిధ్యం వహిస్తున్న రాప్తాడులోని వడ్డుపల్లి, మదిగుబ్బ గ్రామాల మీదుగా నేడు జగన్ పాదయాత్ర సాగుతోంది.

## పాఠశాలల అవసరాలపై సమావేశం

రావులపాలెం: స్థానిక ఎమ్.ఆర్.సి. భవనంలో మండల విద్యాధికారి ఎమ్. హరిప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం యుడైస్, బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్ఈఓ మాట్లాడుతూ యుడైస్ విషయమై మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన తరగతి గదులు, కాంపౌండ్ వాల్స్, టాయిలెట్స్ ఇతర సౌకర్యాలు కల్పించేందుకు బడ్జెట్ విడుదలైనట్లు ఆయన తెలిపారు. ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్కూలు అవసరాలను పరిశీలించి ఒక నివేదికను తయారు చేసుకొని తమకు అందించాలన్నారు. విద్యార్థులకు అవసరమైన ఏక రూప దుస్తులు, రవాణా సౌకర్యం ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల సౌకర్యం కోసం ఎడబ్ల్యుపి బడ్జెట్‌లో పొందుపర్చినట్లయితే త్వరితగతిన ప్రభుత్వం నుండి నిధులు మంజూరౌతాయని స్పష్టం చేసారు. విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ సిబ్బంది ఐవిఎన్ మూర్తి, సిహెచ్ త్రిమూర్తులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# హైడ్రోకార్బన్లతో కెజి బేసిన్ సుసంపన్నం



సదస్సు సంచికను విడుదల చేస్తున్న వీసీ జి.నాగేశ్వర రావు

**వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు**

విశాఖపట్నం : దేశ ఇంధన అవసరాలు తీర్చే విధంగా హైడ్రోకార్బన్లతో కెజి బేసిన్ సుసంపన్నంగా ఉందని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు అన్నారు. సోమవారం ఉదయం ఏయూ డెల్టా స్టడీ సెంటర్‌లో ఓఎన్‌జిసి అధికారులకు నిర్వహిస్తున్న 'మోడరన్ డెల్టాస్-ఏ ఫీల్డ్ సెమినార్'ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ భూవిజ్ఞాన శాస్త్రంలో ఏయూ ఎంతో ప్రగతి సాధించిందన్నారు. జియాలజీ, జియో ఫిజిక్స్ విభాగాలతో, డెల్టాస్టడీస్, సెంటర్ ఫర్ బే ఆఫ్ బెంగాల్ అధ్యయన కేంద్రాలతో విశిష్ట పరిశోధనలు నిరంతరం జరుపుతోందన్నారు. అత్యుత్తమ బోధన సిబ్బంది, పరిశోధకులు ఏయూలో ఉన్నా రన్నారు.వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వర రావు మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలను గుర్తించి తగిన పరిష్కారాలను చూపాలన్నారు. ఓఎన్‌జిసి డెల్టా స్టడీస్ సెంటర్‌కు అవసరమైన పూర్తి సహకారాన్ని అందించి, ప్రోత్సహిస్తోందన్నారు. కోర్సుల రూపకల్పనలో పరిశ్రమల నిపుణుల సూచనలు తీసుకోవడం జరుగుతోందన్నారు. ఏపీకి సంపదగా నిలచే కెజి బేసిన్‌ను ఉపయుక్తంగా మలచుకోవడం ఎంతో అవసరమన్నారు.డెల్టాస్టడీస్ అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య కె.సత్యనారాయణ మాట్లాడుతూ భౌగోళికంగా ఉన్న అంశాలను అధ్యయనం , విశ్లేషణ చేయడం జరుగుతుందన్నారు. ఓఎన్‌జిసి సహకారంతో ఈ సదస్సు నిర్వహణ జరుగుతోందన్నారు. కోర్సు సమన్వయకర్త ఆచార్య టి.వై నాయుడు మాట్లాడుతూ ఆయిల్ జియాలజిస్ట్‌లకు ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. ఫీల్డ్ అబ్జర్వేషన్ వలన వైవిధ్యత తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి.వినోద రావు, శిక్షణ కార్యక్రమ సమన్వయకర్త ఆచార్య టి.ఎన్ ధనుంజయ రావు, ఓఎన్‌జిసి డిజిఎం పి.వి రావు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు, విశ్రాంత ఆచార్యులు తదితరుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సు సంచిక, కోర్సు మెటీరియల్స్‌ను విడుదల చేశారు.

# జయప్రదంగా ముగిసిన వైజాగ్‌ఫెస్ట్

విశాఖపట్నం : వైజాగ్‌ఫెస్ట్‌కు ఆదివారం ఆఖరిరోజు కావడంతో ఉదయం 11 గంటల నుండే సందర్శకులు హాజరయ్యారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, షార్ట్‌ఫిల్మ్స్, సాహిత్యగోష్టులు జరగడంతో విద్యార్థులు, యువకులు, వృద్ధులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఫెస్ట్ ఛైర్మెన్ పూర్వ విసి శ్రీ కె.వి.రమణ, ఫెస్ట్ ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ ఆధ్వర్యంలో బహుమతులు ప్రధానోత్సవం జరిగింది. ఆదివారం జరిగే ఫెస్ట్‌కు ముఖ్యఅతిధిగా సినీ దర్శకులు బాబ్జి, ఎం.ఎల్.సి బొడ్డు నాగేశ్వరరావు, సాహితీవేత్త తెలకపల్లి రవి లు పాల్గొన్నారు. కులం, మతం, ప్రాంతాలకు అతీతంగా అందరూ చేస్తున్న పండుగగా వైజాగ్‌ఫెస్ట్ నిర్వహణ ఉందని సినీ దర్శకులు బాబ్జి కొనియాడారు. ఇదే స్ఫూర్తితో ఉభయ తెలుగురాష్ట్రాల్లో అనేక ఫెస్టులు జరగాలని ఆయన ఆకాంక్షించారు. 32 కళా ప్రదర్శనలు నిర్వహించారు. గురజాడ సాహిత్యవేదికపై జరిగే కార్యక్రమాల్లో తెలకపల్లి రవి పాల్గొన్నారు. కథలు, కవితలు పోటీలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయబడ్డాయి. సైన్సు & టెక్ ఎగ్జిబిషన్‌లో అనిట్స్, విజ్ఞాన్, గాయిత్రి వంటి విద్యాసంస్థల అధిపతులు పాల్గొన్నారు. జిల్లా వ్యాపితంగా నిర్వహించిన విద్యార్థులకు చెకుముఖి సైన్సు సంబరాలు జరిగాయి. వైజాగ్‌ఫెస్ట్‌ను సుమారు 4లక్షల మంది తిలకించినట్లు నిర్వహకులు తెలిపారు. అత్యంత జయప్రదంగా జరిగిన ఈ వైజాగ్‌ఫెస్ట్‌కు సహకరించిన జిల్లా అధికారయంత్రాంగానికి ఎయు యజమాన్యానికి, మంత్రివర్యులు శ్రీ గంటా శ్రీనివాసరావు గారికి, వైజాగ్‌ఫెస్ట్‌లో ముఖ్యఅతిధులుగా పాల్గొన్న నగర, సినీప్రముఖులకు ఫెస్ట్‌కార్యదర్శి అజశర్మ ధన్యవాదాలు తెలియజేసారు. సైన్సు & టెక్ ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న వారికి, వారిని ప్రోత్సహించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, కృతజ్ఞతలు తెలిపారు.

ఫెస్ట్ నిర్వహణకు సహకరించిన సిబ్బందికి మెమోంటోలతో ఫెస్ట్ ఛైర్మెన్ పూర్వ విసి కె.వి.రమణ గారు సత్కరించారు. ప్రతీ సంవత్సరం ఈ ఫెస్ట్ నిర్వహించాలన్న అనేక మంది సలహాలను, సూచనలను పరిగణలోకి తీసుకుంటామని ఆయన తెలిపారు.

# అన్ని రహదారులు, కాలువలు పరిశుభ్రంగా ఉండేటట్లు చూడండి

- రోడ్ మార్జిన్లలో చెత్త లేకుండా చూడండి
- ఖాళీ స్థలాలను గుర్తించి నోటీసులివ్వండి జరిమాన విధించండి
- అన్ని షాపుల వద్ద డస్ట్‌బిన్లు ఉండేటట్లు చూడండి
- వార్డు ఆఫీసు సందర్శించిన కమిషనర్
- అన్ని మరుగుదొడ్లను వినియోగహితంగా రూపొందించండి
- సెంట్రల్ డివైడర్సును, మొక్కలను సక్రమంగా నిర్వహించాలి
- డంపర్ బిన్స్ క్రింద మురికి లేకుండా చూడాలి
- నైట్ శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ వహించండి
- 9వ వార్డు కార్యాలయంను ఉపయోగకరంగా తీర్చిదిద్దండి
- సీతమ్మధార. పి అండ్ టి కాలనీ, ఏపియస్ఇబి కాలనీ, హెచ్‌బి కాలనీ, యం.యం.టి.సి కాలనీ సందర్శన

**జివిఎంసి కమిషనర్ హరినారాయణన్**



విశాఖపట్నం: సీతమ్మధార 9 వార్డులోని అన్ని రహదారులు, కాలువలు పరిశుభ్రంగా ఉండేటట్లు చూడాలనిజివియంసి కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. క్షేత్ర పర్యటన సందర్భంగా 9వ వార్డులో సోమవారం ఆయన పర్యటించి పలుసూచనలు చేశారు. రోడ్ మార్జిన్‌లలో చెత్త లేకుండా చూడాలని పేర్కొన్నారు. ఖాళీ స్థలాలను గుర్తించి నోటీసులివ్వడం, జరిమానా విధించడం చేయాలని కోరారు. అన్ని షాపుల వద్ద డస్ట్‌బిన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. వార్డు ఆఫీసు సందర్శించి హాజరు పరిశీలించారు. వార్డు కార్యాలయ అభివృద్ధికి అంచనా రూపొందించాలని పేర్కొన్నారు. అన్ని మరుగుదొడ్లను వినియోగహితంగా, ఆకర్షణీయంగా రూపొందించాలని కోరారు. సెంట్రల్ డివైడర్స్‌ను, మొక్కలను సక్రమంగా నిర్వహించాలని కోరారు. డంపర్‌బిన్స్ క్రింద చెత్త లేకుండా చూడాలని ఆదేశించారు. అన్ని బడ్డీలను, తోపుడు బళ్ళను రెగ్యులేట్ చేయాలని పేర్కొన్నారు. అదేవిదంగా నైట్‌శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధవహించాలని కోరారు. సీతమ్మధార పి అండ్ టి కాలనీ, ఏపియస్ఇబి కాలనీ, హెచ్‌బి కాలనీ, యం.యం. టి.సి కాలనీ సందర్శించి పలు సూచనలు చేశారు. హెచ్.బి.కాలనీలో రహదారిపై పాడైన విద్యుత్ స్తంభాలను వేరొక చోటికి తరలించాలని, కాలువను పునర్నిర్మించాలని ఆదేశించారు. పారి శుధ్యానికి అవరోధంగా, అపరిశుభ్రంగా నున్న మూడు షాపులకు జరిమానా విధించారు. పర్యటనలో రెండవ జోనల్ కమిషనర్ పి.నల్లనయ్య, ఇ.ఇ వెంకటి, ఏసిపి నాయుడు, యస్.యస్ చిరంజీవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర ప్రశంసనీయం

**- వీజేఎఫ్ సిఎంఆర్ ఇంటర్ మీడియా స్పోర్ట్స్ మీట్‌లో రెహ్మాన్, మేడపాటి**
**- షటిల్ షాట్స్ ...క్యారమ్స్ జోరు**



విశాఖపట్నం : వైజాగ్ జర్నలిస్టుల ఫోరం .. సిఎంఆర్ అంతర్ మీడియా స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా రెండో రోజు సోమవారం జర్నలిస్టులకు షటిల్ బ్యాడ్మింటన్ , క్యారమ్స్‌తో పాటు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ ప్రారంబోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మాజీ శాసనసభ్యులు, మాజీ వుడా ఛైర్మన్ ఎస్ ఎ రెహ్మాన్ , టిడిపి నాయకులు, స్వాతి ప్రమోటర్స్ అధినేత మేడపాటి కృష్ణారెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రెహ్మాన్ మాట్లాడుతూ జర్నలిస్టులకు నిరంతరం క్రీడా పోటీలను నిర్వహించడం వలన మెరుగైన ఆరోగ్యం లభిస్తుందన్నారు. విశాఖ అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర ప్రశంసనీయమన్నారు. స్వాతి ఛైర్మన్ మేడపాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ క్రమం తప్పకుండా రాష్ట్ర, ఇంటర్ మీడియా స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్న వీజేఎఫ్ పాలకవర్గానికి అభినందన తెలియచేస్తున్నామన్నారు. జర్నలిస్టులతోనే అభివృద్ధికి అవకాశం సాధ్యం అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, టోర్నీ ఛైర్మన్ ఎస్ దుర్గారావులు మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి పోర్టు అవుట్‌డోర్ స్టేడియంలో క్రికెట్ సంబరం ప్రారంభం అవుతుందన్నారు. 10 నుంచి 13 వరకు ఇండోర్ గేమ్స్ నిర్వహణలో భాగంగా అథ్లెటిక్స్, షటిల్, క్యారమ్స్ ఇతర ఆటలపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు తమ పాలక వర్గం హాయంలో 3 రాష్ట్ర స్థాయి జర్నలిస్టుల క్రికెట్ పోటీలతో పాటు 5 ఇంటర్ మీడియా స్పోర్ట్స్ మీట్‌లు నిర్వహించామన్నారు. సభ్యుల సంక్షేమం ధ్యేయంగా ముందుగా సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో వీజేఎఫ్ ఉపాధ్యక్షులు ఆర్ నాగరాజ్ పట్నాయక్, స్పోర్ట్స్ కమిటీ ప్రతినిధులు ఎన్ఎన్ఆర్, బాస్కర్, వీజేఎఫ్ కోశాధికారి పిఎన్ మూర్తి, కార్యవర్గసభ్యులు ఇరోతి ఈశ్వరావు, డేవిడ్‌రాజ్, గిరిబాబు తదితర్లు పాల్గొన్నారు.

రెండు రోజు ఫలితాలు

పోర్టు ఇండోర్ స్టేడియంలో జరిగిన రెండో రోజైన సోమవారం ఉదయం జరిగిన పోటీల షటిల్ బ్యాడ్మింటన్‌లో వి గిరి (ప్రజాశక్తి ) విజేతగా నిల్చారు. వి గిరి, డి రవి (లీడర్ ) మధ్య జరిగిన ఫైనల్స్‌లో 21-11 తేడాతో గిరి విజేతగా నిల్చారు. అంతకుముందు జరిగిన సెమి ఫైనల్స్‌లో వి గిరి ( ప్రజాశక్తి ) 21-8 తేడాతో ఆర్ కిశోర్ ( ది హిందూ ) పై , డి రవి ( లీడర్ ) 21-11 పై బి శంకర్ ( మీడియా విజన్ ) పై విజయం సాధించారు. పురుషుల క్యారమ్స్ విభాగంలో ఎస్ ఎం షరీఫ్ (మీడియా విజన్ ) ప్రథమ, గయాజ్ (టాలీవుడ్ ) ద్వితీయ , శ్రీనివాస్ (విజన్) తృతీయ స్థానంలో నిల్చారు. మహిళల క్యారమ్స్ విభాగంలో లో సౌమ్య ( దక్కన్ క్రానికల్ ) ప్రథమ, ఇ శశి (విజన్‌టైమ్) ద్వితీయ స్థానంలో నిల్చారు.

# డయల్ యువర్ కమిషనర్‌కు 10 ఫిర్యాదులు



విశాఖపట్నం: జివియంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ (నెంబరు 1800-4250-0009) కార్యక్రమానికి 10 ఫిర్యాదులు అందాయి. అదనపు కమిషనర్ (ఫైనాన్స్) ఎస్ ఎస్ వర్మ డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి హాజరై పలువురి నుండి వచ్చిన ఫోన్ కాల్స్‌కు సమాధానం చెప్పారు. ఇందులో ఒకటవ జోన్‌కు సంబంధించి రెండు, రెండవ జోన్‌కు సంబంధించి ఒకటి, మూడవ జోన్‌కు సంబంధించి ఒకటి, నాలుగవ జోన్‌కు సంబంధించి ఒకటి, ఐదవ జోన్‌కు సంబంధించి నాలుగు, ఆరవ జోన్‌కు సంబంధించి ఒకటి ఫిర్యాదులు అందాయి. సంబంధిత అధికారులు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి మూడురోజులులోగా నివేదిక సమర్పించాలని కోరారు.

# జివిఎంసి గ్రీవెన్సుకు 141 ఫిర్యాదులు




విశాఖపట్నం: జివిఎంసి ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యా లయాలలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్సుడేలో మొత్తం 141 ఫిర్యాదులు అందాయి. కమిషనర్ హరినారాయణన్ ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరిస్తూ వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అందిన మొత్తం 141 పిర్యాదులలో ప్రధాన కార్యాలయానికి సంబంధించి 43 ఫిర్యాదులు అందాయి. ఒకటవ జోన్‌కు సంబంధించి 16, రెండవ జోన్‌కు సంబంధించి ఒకటి, నాలుగవ జోన్‌కు సంబంధించి నాలుగు, ఐదవ జోన్‌కు సంబంధించి 72, ఆరవజోన్‌కు సంబంధించి 5 ఫిర్యాదులు అందాయి. వీటిలో టౌన్‌ప్లానింగ్ విభాగంకు సంబంధించి 31, ప్రజారోగ్యవిభాగానికి సంబంధించి 15, ప్రధానఇంజనీరు విభాగానికి సంబంధించి 46, ఎ.ఓ (డి అండ్ ఎ) విభాగానికి సంబంధించి ఒకటి, యుసిడి విభాగంకు సంబంధించి 4, హార్టికల్చర్ విబాగానికి సంబంధించి ఒకటి, అదనపు కమిషనర్(జనరల్)/సి సెక్షన్ విభాగానికి సంబంధించి మూడు, డిప్యూటి కమిషనర్ రెవిన్యూ విభాగంకు 28, ఇతరులకు సంబంధించి 12 పిర్యాదులు అందాయి.

## ఘనంగా శ్రీ సీతారామ, ఊర్మిళ లక్ష్మణ, మాండవి భరత, శృతకీర్తి శత్రుఘ్నుల


# దివ్య కళ్యాణ మహోత్సవం


ముక్కా శివ సూర్య ప్రసాద్ శర్మ, కళ్యాణ మహోత్సవం నిర్వహకులు వరహా పంతులు వేద పండితులు

పెందుర్తి : సాధరణంగా మనం ప్రతి ఏటా శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవాలు చేస్తుంటాం, చుస్తుంటా, లేదా విని తెలుసు కుంటాం కదా. కానీ శ్రీ సీతారాముల వారి అన్న దమ్ములు, వాళ్ల భార్యలకు కళ్యాణ మహోత్సవం నిర్వహించడం మనకు నేటి వరకు తెలియాదనే చెప్పాలి. ఏన్నో ఏళ్ల క్రితం మన పూర్వికులు సీతరాములు సోధరులందరికి ఓకే సారి కళ్యాణ మహోత్సవం నిర్వహిం చారంటా. ఇప్పుడు ఇదే కళ్యాణ మహోత్సవాన్ని విశాఖ పట్నం జిల్లా, పాపయ్యరాజుపాలెం దరి గొల్లనారాయణపుర వాసి పోస్టల్ డిపార్టుమెంటులో హెడ్ పోస్టుమేనేగా పనిచేస్తు ముందస్తు ఉద్యోగ విరమణ చేసిన ముక్కు శివ సూర్య ప్రసాద్ శర్మకి సాక్షత్తూ శ్రీరాములు వారు కళలో కనిపించి నా దంపతులతో పాటు, నా తమ్ముళ్లందరి కుటంబ సభ్యులందరికి కళ్యాణం చేయ్యమని స్వామి వారు ఆదేశించారంటా. దీనితో సోమవారం సూమూర్తణ గొల్ల నారాయణపురం గ్రామంలో ఘనంగా శ్రీ సీతారామ, ఊర్మిళ లక్ష్మణ, మాండవి భరత, శృతకీర్తి శత్రుఘ్నుల దివ్య కళ్యాణ మహోత్సవం అంగరంగా వైబోవంగా జరిపించారు. ఈ కళ్యాణ మహోత్సవాన్ని కనులారా చుసి తరించడానికి జిల్లా నలుములల నుంచి భక్తులు ఆశేషంగా హాజరయ్యరు.

వేదపండితులు ఈ కళ్యాణాన్ని ఎంతో వైభోవంగా జరిపించారు.

# సింహాద్రిపై 16 నుండి ధనుర్మాస ఉత్సవాలు



సింహాచలం : సింహాద్రిపై ఈనెల 16 తేది ఉదయం 11.23నిలకు స్వామివారి చెంతన కొలువై ఉన్న ఆండాళ్ అమ్మవారి సన్నిధిలో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం కానున్నట్ల స్థానచార్యులు టిపి గోపాలకృష్ణ, ప్రధాన అర్చకులు గొడవర్తి గోపాలకృష్ణ, శ్రీనివాసాచార్యులు తెలిపారు. ధనుర్మాసం సంధర్భంగా విశేష పూజలు, విశేష సేవాకాలము , నెలఘంటా నాదం, రాజభోగము మొదలగు విశేష కార్యక్రమాలు జరుగనున్నట్లు సహాయ కార్యనిర్వాహణాధికారి ఆర్వివిఎస్స్ ప్రసాద్ తెలిపారు. ఈ సంధర్భంగా స్థానాచార్యులు మాట్లాడుతూ ముప్పిదిరోజులు ఎంతో విశేషమైన రోజులని అన్నారు ఈ దనుర్మాసం నెలరోజులు స్వామికి సుప్రభాత సేవకు బదులుగా గోదాదేవి పాడిన 30 పాశురాలును పాడతాం అన్నారు. అంత విశేషమైన ఈ నెలరోజులు చంద్రమానము బట్టి చేయుటకు గుర్తుగా ఆ నెలరోజులు ఇంటి ముంగిట పండగ వాతావరణముతో విశేషమైన ముగ్గులు పెట్టి అందులో నేలగంట పెడతారు . నెలరోజులు వైష్ణవ దేవాలయాలకుభక్తులు వెళ్తారుఅన్నారు. ఈ నెలరోజులపాటు రోజుకు ఒక పాశురమ్ చదువుతారు . ఇలా 30 రోజులు పాశురములు నివేదిస్తారు. ఈ పాశురాలన్ని ఆండాలమ్మ తల్లి ధనుర్మాస వ్రతము చేసి రోజుకో పాశురం ఆశువుగా పాడి 30 రోజులు నియమనిష్టలతో వ్రతము చేసి . ఆ పాండురంగ స్వామిని వివాహం చేసుకొని ఆయనలో ఐక్యమైందని ఆయన తెలిపారు.

# భర్త కనిపించడం లేదని భార్య ఫిర్యాదు



అచ్యుతాపురం: మండలంలో గల పూడిమడక శివారు జాలారపాలెం గ్రామానికి చెందిన కంబాల నాని (26) ఇంటి నుండి వెళ్ళిపోయాడని నానీ భార్య దేముడమ్మ స్థానిక పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసినట్లు ఎస్ఐ దీనబందు సోమవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత నెల 27వ తేదీన తన భర్త కంబాల నాని ఇంటి నుండి వెళ్ళిపోయాడని అయితే అదే రోజు తన ఇంటి దగ్గరలో ఉన్న తెడ్డు సంద్య కూడా కనిపించడం లేదని దేమడమ్మ పిర్యాదు చేసినట్లు తెలిపారు. దేముడమ్మ 5 నెలల గర్భిణి అని పోలీసులు తెలిపారు. దేముడమ్మ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ డి.దీనబందు తెలిపారు.

# శ్రీచైతన్య విద్యార్థుల విహారయాత్ర


విహార యాత్రను ప్రారంభించిన కమలకుమారి

అనకాపల్లి : అనకాపల్లి పట్టణం రింగ్‌రోడ్‌లో ఉన్న శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు సోమవారం స్టీల్ ప్లాంట్‌కు విహార యాత్రకు తరలివెళ్లారు. విహార యాత్రను పాఠశాల ప్రిన్సిపల్ కమల కుమారి ప్రారంభించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ఆమే మాట్లాడుతూ విహార యాత్రకు సంబంధించి అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, స్టీల్‌ప్లాంట్‌లో ఉన్న పార్కులు, దేవాలయాలు, చూడదగ్గ ప్రదేశాలను వాటి చరిత్ర, అవస్యకతను విద్యార్థులకు వివరిస్తామని ఆమే చెప్పారు. ప్రైమరీ ప్రిన్సిపల్ శ్రీదేవి, కేంపస్ ఇన్‌చార్జ్ రమేష్, విద్యార్థులతో పాటు పాఠశాల సిబ్బంది తరలివెళ్లారు.

విజయభాను

సంపాదకీయం

# కోటరీ రాజకీయాలు

ఎట్టకేలకు రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని స్వీకరిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి రాహుల్ గాంధీ ఎన్నిక లాంఛనమేననేది తెలిసిందే. రాహుల్ తప్ప మరెవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఇక అధికారికంగా ప్రకటించడమే మిగిలింది. రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ నాయకత్వ బాధ్యతలు చేపట్టడంలో ఆశ్చర్యమేమీ లేదు. అందుకు కష్టపడవలసింది కూడా ఏమీ లేదు. కానీ నాయకుడిగా రుజువు చేసుకోవడమే ఆయన ముందున్న అతిపెద్ద సవాలు. పైగా కాంగ్రెస్ పార్టీ జవజీవాలు కోల్పోయి ఉన్నది. నాయకత్వం చుట్టూ కోట రీ రాజకీయాలు నడుస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో పార్టీని పునర్నిర్మించి, పునరుజ్జీవింప చేయడం సాధారణ విషయం కాదు. కాంగ్రెస్ పార్టీలో నెహ్రూ కుటుంబానికి ఉన్న పట్టు మూలంగా రాహు ల్ గాంధీ నాయకత్వ బాధ్యతలు ఎప్పుడో చేపట్టవలసింది. కానీ నాయకులకు సహజంగా ఉండే ఆసక్తి రాహుల్ గాంధీ ప్రదర్శించలేదు. ఆయనలో అంతటి పరిణతి ఉన్నట్టు కూడా కనిపించలేదు. ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా రాహుల్ గాంధీ పెద్దరికాన్ని ప్రదర్శించడం మొదలు పెట్టినప్పటి నుంచి వరుసగా వైఫల్యాలు ఎదురయ్యాయి. సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష హోదా కూడా పొందలేకపోయింది. ఉత్తరప్రదేశ్ ఎన్నికల వ్యూహాన్ని, ప్రచార బాధ్యతను తన నెత్తి మీద పెట్టుకున్నారు. యూపీలో ఘోర పరాజయం ఆయన ప్రతిష్ఠను మరింత దిగజార్చింది. పార్టీ శ్రేణులు ఆయనపై నమ్మకాన్ని కోల్పోయాయి. గుజరాత్ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ ఆశ పెట్టుకున్నది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ, రాష్ట్ర నాయకత్వ బలహీనత, పాటీదార్ల ఉద్యమం మొదలైన కారణాల వల్ల బీజేపీ నెగ్గురాలేదేమో అనే ఆశ తప్ప, కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని ఆ పార్టీ శ్రేణులే నమ్మడం లేదు. ఇటువంటి క్లిష్ట పరిస్థితిలో రాహుల్‌గాంధీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపడుతున్నారు.

సోనియా గాంధీని కూడా లెక్కిస్తే కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని చేపట్టిన నెహ్రూ కుటుంబానికి చెందిన ఆరవ నేత రాహుల్. జవహర్ లాల్ నెహ్రూను మొదట్లో మోతీలాల్ కుమారుడిగా చెప్పుకునేవారు. అటువంటిది ఆయన తొలి ప్రధానిగా దేశానికి దిశానిర్దేశం చేసి తనకంటూ స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. ఇక ఇందిరాగాంధీ నెహ్రూ మరణించే నాటికి రాజకీయాల్లో స్థిరపడినా, ప్రధాని పదవిని చేపట్టడానికి ఎంతో చాకచక్యాన్ని ప్రదర్శించారు. ప్రధాని పదవిని చేపట్టిన తరువాత ఉక్కు మహిళగా ప్రపంచవ్యాప్త గుర్తింపును పొందారు. కానీ రాహుల్‌లో అంతటి చతురత లోపించింది. విదేశీ వనితగా విమర్శలను ఎదుర్కొన్నప్పటికీ, కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేజిక్కించుకొని పార్టీని మళ్ళీ అధికారంలోకి తేవడంలో సోనియా ఎంతో రాజనీతి ని ప్రదర్శించారు. కానీ ఆ స్థాయిలో రాజనీతిజ్ఞతను రాహుల్ ప్రదర్శించలేకపోతున్నారు. రాహుల్ గాంధీ అధ్యక్ష పదవిని చేపడుతున్నప్పటికీ, దేశంలో అదొక ప్రాధాన్యమున్న వార్త గా మారలేదు. ఇది రాజకీయాలలో కాంగ్రెస్ పార్టీకి, రాహుల్ గాంధీకి ఉన్న స్థానాన్ని సూచిస్తున్నది. 2004లో అమేథీ లోక్‌సభ స్థానానికి పోటీ చేయడం ద్వారా క్రియాశీల రాజకీయాల లో ప్రవేశించినప్పటి నుంచి ఆయనను ప్రజలు గమనిస్తున్నారు. ఈ పదమూడేండ్ల కాలంలో ఆయన వ్యవహారసరళి మూలంగా ప్రజలకు ఆయన నాయకత్వం పట్ల ఆసక్తి పోయింది. కాంగ్రెస్ పార్టీ బలహీనపడి పోవడం కూడా ఈ అనాసక్తికి కారణం. ప్రాంతీయ రాజకీయపక్షాలు బలపడే క్రమంలో కాంగ్రెస్ రాజకీయాలు అప్రధానమైపోయాయి. విశాలమైన భారత దేశంలో అనేక సమాజాలున్నాయి. ప్రతి రాష్ట్రంలో భిన్న పరిస్థితులు ఉన్నాయి. ఎవరి ఆకాంక్షలు వారివి. ఎవరి అభివృద్ధి దశ వారిది. ప్రాంతీయ ఆకాంక్షలను తీర్చగలిగే నాయకులు ఇప్పుడు అవసరం. అటువంటి నాయకత్వాన్ని అందించడం జాతీయ పార్టీలకు సాధ్యమా అనే అనుమానం తలెత్తుతున్నది. భారతీయ సమాజాన్ని ఏకశిలా స్వరూపంగా భావించే బీజేపీ దేశవ్యాప్తంగా విస్తరించలేదు. కాంగ్రెస్ పార్టీ బలహీనపడిన కొన్ని రాష్ట్రాలలోనే నెగ్గుకు రాగలిగింది. గత సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజారిటీ వచ్చినప్పటికీ, దేశవ్యాప్తంగా అం త బలమైన పునాది కలిగి లేదు. ఒక నాయకుడిగా మోదీ స్థానం కూడా బలహీనపడ్డది. కాంగ్రెస్ పార్టీ తన బలహీనతను అధిగమించే సూచనలు కనిపించడం లేదు. రాహుల్ నాయకత్వంపై పార్టీ శ్రేణులకు, ప్రజలకు పెద్దగా ఆశలు ఉన్నట్టు కనిపించడం లేదు. అయినప్పటికీ ఆందోళన పడవలసిందేమీ లేదు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి దేశ ప్రజలు ఎంతో పరిణతిని సాధించారు. జాతీయ పార్టీల స్థానంలో తమ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రాంతీయ పార్టీలను ఎన్నుకుంటున్నారు. బాధ్యతగా జాతీయ కోణంలో ఆలోచిస్తున్నారు.

# విశ్వ శాంతి కోసం నగర సంకీర్తన



విజయనగరం : హరే కృష్ణ మూమెంట్ వారి ఆద్వర్యంలో బీచ్ రోడ్డులోని శ్రీమాన్ తాల్లపాక అన్నమాచార్యుల విగ్రహం వద్ద నిర్వహించ బడినది. కలియుగ ప్రబావం దృష్టిలో వుంచుకొని శ్రీ అద్వైత ఆచార్యుల వారు శ్రీ కృష్ణ భగవానుని ఏకాగ్రత భక్తితో చైతన్య మహ ప్రభు అవతారంగా అవతరించ వలెనని పార్థించారు. శ్రీ అద్వైత ఆచార్యుల వారి కోరిక మేరకు శ్రీ కృష్ణభగవానుడు కలియుగంలో 500 సంవత్సరముల క్రీతం చైతన్య మహ ప్రభువుగా అవతరించి సంకీర్తన యజ్ఞము ను ప్రారంబించారు. ప్రస్తుత సమాజంలో కుల, మత, జాతి, ప్రాంత, లింగ బేదాలతో కలియుగంలో గొడవలు పెట్టుకుంటు ప్రశాంతత లేకుండ వుంటున్నారు. ఈ తరుణంలో శ్రీ ఏ సి భక్తి వేదాంత స్వామి ప్రభుపాదుల వారు 1960 సంవత్సరములో ఈసంకీర్తనాన్ని విశ్వవ్యాప్తం చేసారు. వీరు చెప్పిన ఒకే మంత్రముతో ప్రపంచములోని అన్ని దేశాలవారు తమతమ ప్రాంత, కుల, లింగ బేదాలను మరచి హరే కృష్ణ జప యజ్ఞం తో సంకీర్తన నిర్వహించి ప్రశాంతత పొందుతున్నారు. అద్యాత్మిక అవగాహన లేకపోవడం కారణంగా ప్రజలందరిలో ప్రశాంతత లేకుండా తెలియని మానసిక వొత్తిల్లకు లొనవుతున్నారు. ఈ సంకీర్తన యజ్ఞాల కారణంగా ప్రజలలో బేదాలు మరచి మనుషుల మద్య ఐక్యమత్యం వచ్చిప్రశాంతత పొందగలుగుతారు.

ఈ కార్యక్రమము హరే కృష్ణ మూమెంట్ అద్యక్షులు నిష్కించన భక్తదాస ఆద్వర్యంలో నిర్వహించబడుతుంది. సోమవారం నిర్వహించబడిన నగర సంకీర్తన కార్యక్రమములో పాల్గొన్న భక్తులు మాట్లాడుతు, ఇటువంటి నగర సంకీర్తనలు నిర్వహిం చుట ద్వారా యువకులలో ఆధ్యాత్మిక భావమును పెంపొందించుట ద్వారా ప్రశాంతత పొందగలరని తెలియ జేసినారు. ఇటువంటి కార్యక్రమాలు మరి ఎన్నో నిర్వహించవలనని తెలియజేసినారు. హరేకృష్ణ మూమెంట్ నిర్వహించుచున్న సుభోజనం అన్నదాన కార్యక్రమాలకు నగర ప్రజల సహకరించవలెనని కోరినారు. ఈ కార్యక్రమములో 200 మంది పాల్గొన్నారు. భక్తుల కోరిక మేరకు ఈ సంకీర్తన కార్యక్రమమును ప్రతి నెల రెండొవ ఆదివారము శ్రీమాన్ తాల్లపాక అన్నమాచార్యుల విగ్రహం వద్ద నిర్వహించ దలిచినాము అని హరే కృష్ణ మూమెంట్ అద్యక్షులు నిష్కించన భక్తదాస గారుభక్తులకు తెలియజేసినారు. ఆసక్తి కలిగిన వారు ప్రతి నెల రెండొవ ఆదివారము జరిగే ఈ సంకీర్తన కార్యక్రమములో పాల్గొని జయప్రదం చేయవలసినిదిగా కోరుచున్నాము.

# గ్రామ సంసద్ అభయాన్ రాష్ట్ర ఇన్‌చార్జిగా హిల్డెన్ నియామకం



రాష్ట్ర ఇన్‌చార్జిగా నియమించిన హిల్డెన్

నర్సీపట్నం : గ్రామ సంసద్ అభయాన్ రాష్ట్ర ఇన్‌చార్జిగా పికెఎం.హిల్డెన్ నియమింప బడ్డారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన జాతీయ సమావేశంలో గ్రామ సంసద్ అభయాన్ జాతీయ అధ్యక్షుడు భజరంగ్‌ముని నియామక ఉత్తర్వులు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ సంసద్ అభయాన్ ద్వారా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఇన్‌చార్జి హిల్డెన్ తెలిపారు. గ్రామ స్వరాజ్య స్థాపన కోసం రాజ్యాంగం ద్వారా సంక్రమింపబడిన హక్కులు ప్రజలు పొందేలా అవగాహన కలిగిస్తామన్నారు. 13 జిల్లాల్లో జిల్లా కమిటీలు ఏర్పాటు చేసి ఆ కమిటీల ద్వారా గ్రా సంసద్ అభయన్ లక్ష్యాలు నెరవేరుస్తామన్నారు. ఈ నెలాఖరున గ్రామ సంసద్ జాతీయ అధ్యక్షులతో పాటు కొందరు ప్రతినిధులు మన రాష్ట్రానికి వస్తారన్నారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షునిగా కె.వీరస్వామి నియమితు లయ్యారన్నారు. తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధితులను చిత్తశుద్దితో నిర్వహిస్తానని ఆమె తెలిపారు.

# సిపిఎం 22వ మహాసభలు విజయవంతం చేయాలి



గోడపత్రికను విడుదల చేస్తున్న దృశ్యం

రావికమతం : ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న సిపిఎం పార్టీ 22వ మహాసభలు ఈ నెల 22న జరుగుతున్నాయని, ఈ సభలను జయప్రదం చేయాలని సిపిఎం కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు కోరారు. మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ గోడ పత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సుజల స్రవంతి వాటర్ ప్లాంట్ నిర్మించాలని, కొత్తకోట నుండి రావికమతం వరకు గల రోడ్డుమరమ్మత్తులు చేపట్టాలని ఈ మహాసభల్లో తీర్మానించ నున్నారన్నారు. సిపిఎం ప్రజల పార్టీ అన్నారు. అనేక సమస్యలపై ఎన్నో పోరాటాలు చేస్తుందన్నారు. ఎటువంటి పదవులు ఆశించ కుండా కేవలం ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న పార్టీ సిపిఎం పార్టీ అన్నారు. సిపిఎం నిర్వహిస్తున్న ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

# డి.ఎల్.పురం భూ బాధితులకు న్యాయం చేయాలి : సిపియం



విశాఖపట్నం : విశాఖ జిల్లా నక్కపల్లి మండలం డి.ఎల్.పురం భూ సమస్యపై ఈ రోజు సిపియం జిల్లా కార్యదర్శి కె.లోకనాధం, భూ బాధితులు కుందేటి నాగేశ్వరరావు, కిల్లాడి రమణ తదితరులు జిల్లా జాయింట్ కలెక్టర్‌ని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపియం జిల్లా కార్యదర్శి కె.లోకనాధం మాట్లాడుతూ డి.ఎల్.పురం గ్రామ సర్వే నెంబర్ 189 సబ్ డివిజన్ 194/2, 194/3, 195/3, 195/3, 196/2, 197/1, 197/2, 198/1, 198/2, 199/1, 199/2లలో సుమారు 65 ఎకరాలు భూమిలకు స్థానిక దళితులు, పేదలకు సంబంధించి 14 కుంటుంబాలకు 1967లో ప్రభుత్వం 'ఢి' పారం పట్టాలు మంజూరు చేసింది. అప్పటి నుండి ఈ భూమలు వారి స్వాధీనంలోనే వున్నాయి. 1994లో హైదరాబాద్‌కు చెందిన పారిశ్రామికవేత్త దండు రామలింగరాజు భూ రికార్డులను తన పేరుమీద మార్చుకున్నారు. ఈ విషయంపై అధికారులు చుట్టూ తిరిగినా న్యాయం జరగలేదు. ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన 'సిట్' ప్రత్యేక బృందానికి ఫిర్యాదు చేశారు. నేటికీ ఆ సమస్యపై అధికారులు విచారణ చేయలేదు. ఇదే అదునుగా రామలింగరాజు హైదరాబాద్ నుంచి రౌడీలను రప్పించి దౌర్జన్యంగా ఆ భూముల్లో లబ్ధిదారులు వేసుకున్న పాకలను తొలగించారు. మారణాయుధాలతో బెదిరించి అక్కడ నుండి లబ్ధిదారులను తరిమి తరిమి కొట్టారు. ప్రజలందరూ తమ ప్రాణాలను అరిచేతిలో పెట్టుకొని పరుగులు తీశారన్నారు. ఈ దుర్ఘటన జరిగిన తరువాత పేదల తరపున వుండాల్సిన పోలీసు యంత్రాంగం దండు రామలింగరాజుపై కేసు నమోదు చేయాల్సిందిపోయి ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు.

సమయం (కవి)

## ఊహల-పల్లకి

కల-కల-కల
కిల-కిల-కిల
కోకిలమ్మ కుహ; కుహ;లు చేశావె!
గల -గల -గల
గిల-గిల-గిల
గోదావరి నడకల్లా!
వోయిలు -వొలక బోసావె!
చల - చల- చల
చిల-చిల-చిల
వాన చినుకుల్లా!
వాలావే - నా ఒంటిపైనా! ...॥కల॥
జల-జల-జల
జిల-జిల-జిల
అంతర జాలం చూపించవే ఇకనైనా!
వేయనా!... తీయనా!
తియ్యినా!... వేయనా!
జమ చెయ్యినా!
నా ఆర్థిక లావాదేవీలు
నీ కుహ:రంలో
తేలనా!... ములగనా!
ములగనా!.. తేలనా!
తేలి - తేలి- ములగనా!
నీ నది నీటి మడుగులో
డల - డల - డల
డిల- డిల- డిల
డమరుకం మ్రోగించనా
నీ మదిలోనా! ...॥కల॥
బల - బల-బల
బిల-బిల-బిల
తిరిగానే - తిరిగానే నీ చుట్టూ బొంగరంలా!
ఓనాడు
పల - పల-పల
పిల- పిల- పిలా
నీ ఊహల- పల్లకిలో ఊగనా!
పిల్లన గ్రోవి మోగించనా! ఈనాడు ఇకపైనా! ...॥కల॥

...కవితా రచన
యల్:సిద్ధు
సెల్ నెం: 7702977293

# పంచాంగం

మాసం : మార్గశిర; తిథి : దశమి తె.5.09; హస్త రా.11.02; ఉ.వ. 7.19ల 8.56

మంగళవారం 12-12-2017

**మేషం :** ఉపాధ్యాయులకు విద్యార్థుల పట్ల ఓర్పు, నేర్పు వ్యవహరించ వలసివస్తుంది. భాగ స్వామికుల మధ్య కొత్త విషయాలు చర్చకు వస్తాయి. ప్రముఖుల కలయిక వల్ల ఏమంత ప్రయోజనం ఉండదు. **వృషభం** :రావల సిన ధనం సకాలంలో అందుట వలన పొదుపు దిశగా మీ ఆలోచన లుంటాయి. వాతావరణంలో మార్పు వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. వృత్తి వ్యాపారులకు శ్రమాధిక్యత మినహా ఆశించినంత పురోభివృద్ధి ఉండదు. **మిథునం** : కోర్టు వ్యవహారాలు, స్త్రీలకు స్వీయ ఆర్జన పట్ల ఆసక్తి అందుకు తగిన ప్రోత్సాహం లభిస్తాయి. బంధుమిత్రుల రాకపోకలు కుటుంబీకులతో ఉల్లాసంగా గడుస్తుంది. **కర్కాటకం** : స్త్రీలకు వాహనం నడుపుతున్నప్పుడు ఏకాగ్రత అవసరం. సోదరీ సోదరుల మధ్య అవగాహన కుదురుతుంది. బంధువుల కోసం ధనం విరివిగా వ్యయం చేయవలసివస్తుంది. యాదృచ్ఛికంగా ఒక పుణ్యక్షేత్రం సందర్శిస్తారు. **సింహం** : బంధువుల నుంచి ఒత్తిడి, మొహమాటాలు ఎదుర్కొంటారు. ఎదుటి వారిని అతిగా విశ్వసించటం మంచిది కాదని గమనించండి.. **కన్య** : నిరుద్యోగులకు ఇంటర్వ్యూల్లో ఏకాగ్రత ముఖ్యం. ముఖ్యమైన వ్యవహారాల్లో ఎదుటివారిని సలహా అడగడం మంచిదని గమనించండి. మీ జీవిత భాగస్వామి సలహా పాటించి లబ్ధి పొందుతారు. **తుల** : మీ సామర్థ్యానికి ఆశించినంత ప్రతిఫలం లభిస్తుంది. స్త్రీలు దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. **వృశ్చికం** : స్తీలు విలువైన వస్తువులు చేజార్చుకునే ఆస్కారం ఉంది. ఇళ్ల స్థలాలు, పొలాల అమ్మకంలో పునరాలోచన మంచిది. ఏజెంట్లకు, బ్రోకర్లకు శ్రమాధిక్యత మినహా ఆర్థిక సంతృప్తిఉండదు. **ధనుస్సు** : పెద్దల ఆరోగ్యం గురించి ఆందోళన చెందుతారు. బంధు మిత్రులతో సఖ్యత నెలకొంటుంది. సోదరీ, సోదరులతో ఏకీభవించలేకపోతారు. **మకరం** :రాజకీయ నాయకులు సభలు, సమావేశాల్లో చురుకుగా వ్యవహరిస్తారు. మీ సంతానం విద్య, ఆరోగ్య విషయాల పట్ల శ్రద్ధ కనబరుస్తారు. వృత్తి, వ్యాపార రంగాల వారికి సదవ కాశాలు లభిస్తాయి. **కుంభం** : ఉద్యోగస్తులు సమర్థంగా పనిచేసి అధికారులను మెప్పిస్తారు. వాతా ఎమవరణంలో మార్పు రైతులకు ఆందోళన కలిగిస్తుంది. వ్యవసాయ, తోటల రంగాల వారికి వాతావరణం అనుకూలిస్తుంది. **మీనం** :వ్యాపారాభివృద్ధికి అహర్నిలు శ్రమిస్తారు. ఖర్చులు, చెల్లింపులలో ఏకాగ్రత వహించండి. అర్థాంతరంగా నిలిపి వేసిన పునఃప్రారంభమవుతాయి. ప్రముఖుల సహకారంతో మీ సమస్య పరిష్కారమవుతాయి.

# శుభ ఫలితాలనిచ్చే సుబ్రమణ్యస్వామి

సంకీర్తన



ఒకే శరీరంలో ఆరుముఖాలు పన్నెండు చేతులు గల కార్తికేయునికి సహాయకులుగా పార్వతిదేవి నూపురం నుంచి తొమ్మిది మంది వీరులు జనించారు. వీరబాహు, వీరకేసరి, వీర మహేంద్ర, వీర మహేశ్వర, వీర పురంధర, వీర రాక్షస, వీర మార్తాండ, వీరాంతక, వీర ధీర అని వారిని పిల్వడం జరుగుతోంది. విష్ణు ఆదేశం మేరకు శివుడు ఆ బాలుని నుంచి ప్రణవోపదేశం పొందాడు. ఆ కారణంగా సుబ్రహ్మణ్యేశ్వరుడికి, శివగురు, స్వామానాథ, దేశిక అనే పేర్లు వచ్చాయి. కుమారస్వామి ఇంద్రుని కుమార్తె అయిన దేవయానిని, శివమూర్తి కుమార్తె వల్లీదేవిని వివాహమాడాడు. అలాగే ఆ స్వామి నెమలిన తన వాహనంగానూ, కోడి పుంజును తన ధ్వజంగానూ చేసుకున్నాడు. ఆ కారణంగా స్వామి శిఖివాహనుడు, కుక్కుట ధ్వజుడయ్యాడు. సుమ్రహ్మణ్యేశ్వ రుడి ధ్వజమందు కోడి పుంజు ఉంటుంది. కో అనే ధ్వని ప్రణవమును సూచిస్తుంది. జ్ఞాన భానూదయము నకు ధ్వని సంకేతం. అలాగే స్వామి వాహనమైన నెమలి పురివిప్పి నర్తించునపుడు ఓంకార రూపంలో ఉంటుంది. ఆ కారణంగా స్వామిని ప్రణవ స్వరూపుడిగా చెబుతారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని సేవించే సమయంలో ఉరగేశ్వ రాయనమః మహోరణాయనమః అని కీర్తించడం జరుగుతోంది. వల్లీదేవి స్వరూపంలో ఉన్నదని, స్వామి కూడా సర్ప రూపంలో ఉంటాడని పురాణాల ద్వారా అవగతమవుతోంది.తెలుగు రాష్ట్రాలలో సుబ్రహ్మణ్య షష్టి పర్వదినాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు ఈ పర్వదినం రోజున స్వామికి ఘనంగా పూజలు నిర్వహిస్తారు. సుబ్రహ్మణ్య షష్టిరోజున వేకువ జామునే నిద్రలేచి తలంటు స్నానం చేస్తారు. అనంతరం సుబ్ర హ్మణ్యేశ్వరునికి సమర్పిం చడానికి చిలీ (నువ్వులు, బెల్లంతో కలగలిపినది) తయా రుచేసి, కొబ్బరి కాయలు, అరటి పళ్ళు, పాలు, కోడిగుడ్లతో బయలు దేరుతారు. సుబ్రహ్మణ్యేశ్వరుడు సర్పాకారుడు కావ డంవల్ల సమీప ప్రాంతాలలో ఉన్న పుట్టలకు చేరుకుని పుట్టను శుద్ధిచేసి, పసుపు, కుంకుమ బొట్లు, అందమైన ముగ్గులతో అలం కరిస్తారు. అనంతరం, పాలు కోడి గుడ్లను పుట్టలలోవేసి, ప్రసాదాలను, కొబ్బరి కాయలను నివేదిస్తారు. స్వామిని భక్తితో పూజిస్తూ, భజన గీతాలు, భక్తి పాటలతో కీర్తిస్తారు. అనంతరం పుట్ట మన్నును తమ చెవులకు రాసుకుంటారు. అలా చేయడంవల్ల తమకు చెవికి సంబంధించిన వ్యాధులు దరిచేరవని నమ్ముతారు. అలాగే మహిళా భక్తులు, పుట్టలో పాలుపోసి, పుట్ట చుట్టూ భక్తి శ్రద్ధలతో ప్రదక్షిణలు చేస్తారు. సంతాన ప్రాప్తికోసం స్వామిని మనసావాచా ఆరాధిస్తారు. పిల్లలు, స్వామికి ప్రణామాలు అర్పించి మందుగుండు సామాను కాలుస్తారు.

అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే సుబ్రహ్మణ్య ఆరాధన శక్తిని, ఐశ్వర్య మహాద్భా గ్యాలను కల్గిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ఆ సుబ్రహ్మణ్యే శ్వరుని అపార కృపా రసామృతం అందరిమీదా వెల్లి విరి యాలని మనసావాచా అందరూ పూజిస్తారు. పార్వతీ పరమేశ్వరుల ప్రేమకు, అనుగ్రహానికి ఐక్యరూపం సుబ్రహ్మణ్య స్వామి. స్వామి అనే నాయ ధేయం కేవలం సుబ్రహ్మణ్యానికి సొంతం. దేవ సేనాధిపతిగా, సకల దేవగణాల చేత పూజ లందుకునే దైవం కుమారస్వామి అని పురాణాలు చెబు తున్నాయి. అలాంటి షణ్ముఖుని అనుగ్రహం పొందగలిగితే స్కంద పంచమి, కుమార షష్టి రోజున స్వామని పూజించాలి. కుమారస్వామని పూజిస్తే గౌరీశంకరుల కటాక్షం మనకు లభించినట్టేనని పురాణాలు చెబు తున్నాయి. శివపార్వతుల తనయుడైన కుమారస్వామి గంగాదేవి గర్భంలో పెరిగాడు. ఆమె భరించ లేకపోవడంతో, ఆ శిశువు రెల్లుపొదల్లో జారిపడింది. ఆ శిశువును కృత్తికా దేవతలు ఆరుగురు స్తన్యమిచ్చి పెంచారు.

జారిపడినందున ఆ శిశువునకు స్కందుడని, రెల్లుగడ్డిలో ఆవిర్భవించడంతో శరవణుడని, కృత్తికా దేవతలు పెంచడంతో కార్తికేయుడని కుమారస్వామి అని పిలు స్తారు. ఇక సుబ్రహ్మణ్యునికి ఉన్న ఆరుముఖాలకు ప్రత్యేకతలు ఉన్నాయి. మయూర వాహనాన్ని అధిరోహించి కేళీ విలాసాన్ని ప్రదర్శించే ముఖం, పరమేశ్వరునితో జ్ఞానచర్చలు జరిపి ముఖం, శూరుడనే రాక్షసుని వదించిన స్వరూపానికి ఉన్న ముఖం, శరణు కోరిన వారిని సంరక్షించే ముఖం, శూలాయుధ పాణియై వీరుడిగా ప్రస్ఫుటమయ్యే ముఖం, లౌకిక సంపదల్ని అందించే ముఖం ఇలా ఆరు ముఖాల స్వామిగా ఆనందదాయ కుడిగా స్వామి కరుణామయుడిగా భక్తులచే నీరాజనాలు అందు కుంటున్నాడు. స్కంద పంచమి, షష్టి రోజుల్లో శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే సకల సంపదలు, సుఖవంతమైన జీవితం చేకూరుతుందని పురో హితులు చెబుతున్నారు.

# కాపులను బీసీలో చేర్చడంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తా

## - మంత్రి మల్లాడి

యానాం : రాష్ట్రంలోని కాపులను బిసిలో చేర్చడం వలన బిసిలకు జరిగే అన్యాయం గూర్చి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేసి న్యాయపరంగా పోరాటానికి హైకోర్టు, సుప్రీంకోర్టులో కేసులు దాఖలు చేస్తామని పుదుచ్చేరి ఆరోగ్యశాఖమంత్రి మల్లాడి అన్నారు. అగ్నికుల క్షత్రియ కల్యాణమండపంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిసి నేతల భవిష్యత్ కార్యాచరణ సమావేశం అనంతరం ఆయన బిసి నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కాపులను బిసిలో చేర్చే విషయంపై మంజునాథం కమీషన్ నివేదిక రాకుండానే చట్టసభల్లో తీర్మానంచేయడం ఎంత వరకు న్యాయం అని ప్రశ్నించారు. రాష్ట్రంలో టిడిపి, బిజెపిల విజయానికి కారణం అయిన పవన్ కల్యాణ్ బిసి లకు 33 శాతం రిజర్వేషన్లు గురించి ఎందుకు ప్రశ్నించడంలేదన్నారు. రాష్ట్ర జనాభాలో 8 శాతం మాత్రమే ఉన్న కాపులకు రూ. 1000 కోట్లు నిధులు ఇచ్చిన చంద్రబాబు 54 శాతం ఉన్న బిసిలకు రూ. 270 కోట్లు మాత్రమే ఎందుకు ఇచ్చారన్నారు. సాంఘికంగాను, విద్యా వేనెకబాటుతనంలో ఉన్నవారికి రిజర్వేషన్లు వఅమలుచేయాలి తప్ప అగ్రవర్ణాలకు అమలుచేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తంచేశారు. బిసిలకు జరుగుతున్న అన్నాయ్యంపై కేంద్ర మంత్రులను కలసి తమ వాదనను వినిపించేలా కార్యచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అన్ని కులాల సభ్యులతో కోర్ కమిటీ, ప్రచారం, ఆర్గనేజింగ్, కోఆర్డినేషన్, లీగల్, డిసెప్లేన్ కమిటీలను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు.

***వచ్చే ఎన్నికలలో టిడిపికీ గుణపాఠం చెప్పాలి***

బిసిల పార్టీ అని చెప్పుకొంటూ బిసిలకు అన్నివిధాల అన్యాయం చేసిన టిడిపికి వచ్చే ఎన్నికలలో గుణపాఠం చెప్పవలసిన అవసరం ఉందని బిసి నాయకులు కార్యచరణ సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. అగ్నికులక్షత్రియ కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో కాపులకు రిజర్వేషన్ల ప్రకటనపై టిడిపి నిర్ణయాన్ని బిసి సంఘాల నాయకులు వ్యతిరేకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాపులు ఆర్థికంగా వెనుకబడి ఉంటే వారిని ఆదుకోవడానికి ఇతర కులాల మాదిరిగా ప్యాకేజీలు ఇచ్చి న్యాయం చేయాలి తప్ప బిసిల తరహాలో ఏనాడు వివక్షకు గురికాని కాపులను బిసిలో చేర్చడం అర్థరహితం అన్నారు. రాష్ట్రంలో టిడిపికి ఇదే చివరి అధికారం అన్ని వచ్చే ఎన్నికలలో ప్రజలు (బిసి కులాలు) సరైన బుద్ధి చెపుతాయని బిసి నాయకుడు పి. సూర్యనారాయణ పిలుపునిచ్చారు. జెఎసి చైర్మన్ రామచంద్రయ్య మాట్లాడుతూ రిజర్వేషన్ల విషయంలో అన్ని రాజకీయ పార్టీలు బిసిల గొంతు నొక్కేందుకు ఒక తాటిపైకి వచ్చాయన్నారు. రాష్ట్ర జనాభా ప్రకారం శాసనసభలో 95 మంది బిసి ఎమ్మెల్యే ఉండవలసి ఉండగా కేవలం 27 మంది ఎందుకు ఉన్నారో చెప్పాలన్నారు. ఈ సభలో పుదుచ్చేరి మంత్రి మల్లాడి క్రిష్ణారావు మాట్లాడుతూ కాపు రిజర్వేషన్ల విషయంలో హెూంమంత్రి చినరాజప్ప పక్షపాతంతో వ్యవహరించారన్నారు. బి సత్యనారాయణ, వి. హనుమంతురావు, పి. రామచంద్రయ్య, బిసి కోటాలో పదవులు పొంది కాపులకు మద్దతుగా వ్యవహరిస్తున్న తీరుపై బిసిలకు సమాధానం చెప్పాలని మల్లాడి డిమాండ్ చేశారు. ఉద్యమ నిర్వాహణకు యానాంలో బిసి సంఘాల తరపున రూ. 250000 విరాళం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో 13 జిల్లాలకు చెందిన బిసి నాయకులు ఎన్విరావు, బందన రాంబాబు, కె. చిట్టిబాబు, పంపాన రమకృష్ణ, బి. సత్యనారాయణ, దాసరి సత్యనారాయణ, పి జయప్రకాష్, కె. వరలక్ష్మీ, సిహెచ్. వెంకటేశ్వరరావు, ఎ. రామచంద్ర యాదవ్, కె. వెంకటేశ్వరరావు, చింతపల్లి గురు ꠱ప్రసాదు, యానాంకుచెందిన బిసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రన్న బీమా పరిహారం అందచేత



భీమునిపట్నం : భీమునిపట్నం ఎగువపేట 22 వార్డులో చంద్రన్న భీమా పంపిణీ చేశారు. పుక్కల్ల బాలాజీ గతంలో గుండెపోటుతో మృతి చెందాడు. మృతిని బార్య పుక్కల్ల ఎల్లయ్యమ్మకు చంద్రన్న భీమా ఐదు వేల రూపాయలు భీమిలి, పట్టణ టి.డి.పి. అధ్యక్షులు గంటా.నూకరాజు, గాడు.సన్యాసి నాయుడు అందించారు. ఈ కార్యక్రమంలో పుక్కల్ల అమ్మోరు, పి.ఎల్లయ్యమ్మ, పి.యోగి, ఎం.సంజీవ్ కుమార్, జీ.పోలిరాజు, వి.గరగయ్య, డక్కన్ శ్రీను కనకల అప్పలనాయుడు, ఆదర్శ హిందీ ప్రేమిమండలి అధ్యక్షులు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, చంద్రన్న భీమా మిత్ర సభ్యురాలు పోతిన .వెంకటలక్ష్మి వార్డు సభ్యులు తదీతరులు పాల్గొన్నారు.

# ఘనంగా రత్నగిరిపై గోపూజ మహోత్సవం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్య క్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు గోపూజ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 9 గంటలకు గోవులను ఆలయ ప్రాంతంలోకి తోడ్కొనివచ్చి శ్రీ రాజా రామరాయ కళా మందిరంలో ప్రధాన అర్చకులు కొండవీటి. సత్యనారాయణ, గాడేపల్లి. వెంకట్రావు ఆద్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో ఎమ్.జితేంద్ర, చైర్మెన్ ఐవి.రోహిత్, సహాయ కార్యనిర్వహణాధికారి ఈరంకి.జగన్నాధరావు, పిఆర్వో తులా.రాముడు, ధర్మకర్తల మండలి సభ్యులు యడ్ల.రాజా, పర్వత.రాజబాబు, మన మల.రాజేష్, సింగిలిదేవి సత్తిరాజు తదిత రులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఈవో జితేంద్ర మాట్లాడుతు ప్రతీ రోజూ గోవులను పూజించుట వలన మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉంటారని కొనియాడారు. ఈ కార్యక్ర మంలో అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొని గోమాతకు పూజలు చేసారు.

# వ్యక్తిని కాపాడిన కానిస్టేబుల్

యానాం : మద్యం మత్తులో గోదావరిలో జారిపడిపోయిన డింపు కార్మికుడ్ని యానాం కానిస్టేబుల్ పెమ్మాడి కేశవరావు కాపాడారు. ఐ పొలవరం మండలం ఐనాపురానికి చెందిన పాటి శ్రీను మద్యం తాగి బహిర్భూమికి వెళ్ళి గోదావరిలో జారి పడిపోయాడు. శనివారం రాత్రి 10 గంటల సమయంలో ఈ ఘటన చేసుకొంది. కొట్టుకుపోతున్న శ్రీనును చూసి కొందరు యువకులు పోలీసులకు ఫోన్‌చేయగా ఎఎస్ఐ దాసరి పట్టాభిరామయ్య ఈ విషయాన్ని గస్తీలో ఉన్న కానిస్టేబుల్ పెమ్మాడి కేశవరావుకు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకొని నదిలో దూకి మునిగిపోతున్న శ్రీనును కానిస్టేబుల్ కురుసంపేటకు చెందిన యువకునితో ఒడ్డుకు చేర్చారు. అనంతరం యానాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేశవరావును పోలీసులు, గ్రామస్తులు అభినందించారు.

# గ్రామంలో వసతులు కల్పించండి

కాజులూరు : తనుకువాడ గ్రామ శివారు దొరగారి పాలెంలో కనీస వసతులు కల్పించాలని గ్రామ పంచాయతీ వార్డు మెంబర్ డొప్పా బాలకృష్ణ అధికార్లుకు విజ్ఞప్తి చేశారు. గ్రామంలో సరైన రోడ్లు, డ్రైనేజీలు తాగునీటి సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. శలపాక, మంజేరు రహదారి నుంచి గ్రామంలోకి వచ్చేందుకు కోరంగి కెనెల్‌పై నిర్మించిన కాలిబాట వంతెనకు ఇరువైపులా అప్రోచ్ నిర్మించకపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. వర్షం వస్తే అప్రోచ్‌కు వేసిన మట్టి జారిపోయి వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని చెప్పారు. దీనిపై అధికార్లు స్పందించి శివారు గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# గోమాతను దైవంగా పూజించండి

పెద్దాపురం : స్థానిక మరిడమ్మ అమ్మవారి దేవాలయంలో గోపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఇ.ఒ. పుష్పనాథం మాట్లాడుతూ హిందూ సాంప్రదాయాలలో ఇది ప్రధానమైనదని అన్నారు. దేవాదాయశాఖ కమీషనర్ ఉత్తర్వుల మేరకు ప్రతిఏడాది డిశంబర్ 10న ఈ మహెూత్సవం జరుపుతామని అన్నారు. దేవాలయ వేదపండితులు గోమాతకు పసుపు, కుంకమ, పుష్పాలు అక్షింతలతో పూజ జరిపించారు. పూలదండలువేసి, నూతన వస్త్రాలు అలంకరించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు ధర్మకర్తల మండలి, దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**కాండ్రకోటలో....**

అదేవిధంగా పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామంలో గోమాతను పూజించారు. అలయ నిర్వహణాధికారి పులి నారాయణమూర్తి అధ్వర్యంలో గుడి డైరెక్టర్ ఎలిశెట్టినాని, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎలిశెట్టి నాగలక్ష్మీ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గుడాల రమేష్, సర్పంచ్, కుంచేగాంధీ, ఉపసర్పంచి, ఎలిశెట్టి ప్రకాష్ జిల్లా తెలుగు యువత నాయకుడు గవరసాని రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కాపులను బీసీలో చేర్చాలి

## తిరుకోటి డిమాండ్

యానాం : పుదచ్చేరి రాష్ట్రంలోని, యానాంలోని కాపు కులస్తులను బిసిలో చేర్చాలని ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుకొటి భైరవసామి డిమాండ్ చేశారు. పుదుచ్చేరిలోని ఉన్న వన్ఇయర్ కులస్తులు రైతులు గానే ప్రభుత్వం గుర్తిస్తు వెనుకబడిన జాతిగా పుదుచ్చేరిలో గుర్తించి బిసిలో పెట్టి అన్ని వర్గాలో రిజర్వేషన్లు పొందుతున్నారన్నారు.

యానాం కాపులకు మాత్రమే వన్ఇయర్‌లాగా బిసిలో చేర్చకుండా ఉంచడం పుదుచ్చేరి ప్రభుత్వం తప్పిదం. యానాం ప్రజా ప్రతినిధి యానాం ప్రజలైన కాపులకు న్యాయ పరంగా రావలసిన హక్కుల కొరకు పోరాటం చేయకుండా పక్కన ఉన్న ఆంధ్రా రాష్ట్రనికి వెళ్ళి కాపులను బిసిలో చేర్చ కూడదని పోరాటంలో పాల్గొనడం హాస్యాస్పదం అని యానాం కాపులకు ద్రోహంచేసినట్లేనన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన 90 శాతం మంది కాపులు ఉన్నారన్నారు. బ్రతుక తెరువుకోసం అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాపుల ను బిసిలో చేర్చడం వలన యానాంలో బిసి కులాలకు ఏ విధమైన బాధ ఉండదన్నారు.

# చలో అమరావతిని జయప్రదం చేయండి

ఆలమూరు : దీర్ఘకాలంగా వున్న పంచాయితీ వర్కర్స్ సమస్యలు పరిష్కారం కొరకు ఈ నెల 14న నిర్వహిస్తున్న చలో అమరావతిని జయ ప్రదం చేయాలని ఆలమూరు మండల పంచాయితీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సుంకర సత్యనారాయణ, వెల్ల నాగేశ్వరరావులు పిలుపునిచ్చారు. స్థానిక పంచాయితీ కార్యాలయం వద్ద జాస్తి వారి కళ్యాణమండపంలో సోమవారం మండల యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమైన డిమాండ్లను చర్చించటం జరిగింది. ఈ సమావేశంలో మండల యూనియన్ నాయకులు ఎస్.ఎస్.వి. రత్నం, ఎస్.కృష్ణమాచార్యులు, జిల్లా నాయకులు పి.ప్రేమకుమార్, జె.దుర్గారావు, కె.కృష్ణవేణి, పి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు చర్యలు-డిఎస్‌పి

తాళ్లరేవు : రోడ్డు ప్రమాద నివారణ చర్యలను వేగ వంతం చేసేందుకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధంచేస్తున్నామని డిఎస్‌పి. పి.వి. రవివర్మ తెలిపారు. 216 జాతీయ రహదారి నిర్మాణ దశలో ఉన్న కారణంగా వేగం తగ్గించి ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. తాళ్లరేవు మండలంలోని కోరంగి పోలీస్‌స్టేషన్‌లో ఆయన రికార్డులను పరిశీలించారు. జాతీయ రహదారి నిర్మణ పనులు జరుగుతున్న కారణంలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. రోడ్డు పనులు పూర్తి కాగానే ప్రమాదాలు జరగకుండా ఆటో డ్రైవర్లకు, ద్వచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు జాగ్రత్తలపై సదస్సులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం స్టేషన్ ఆవరణలో నిర్మిచిన మోటారు వాహనాలను నిలుపుదల చేసే స్టాండును ప్రారంభించారు.

కోరంగి పోలీసు స్టేషన్‌ను ఆధునికీకరించడంపై ఎస్ఐ సుమంత్‌ను అభినందించారు. కాకినాడ రూరల్ సిఐ ఎస్ రాంబాబు, ఎఎస్ఐలు టివి సుబ్బారాంవు, కె.ఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# కే.జి.బి.వి. పాఠశాల విద్యార్థినుల ప్రతిభ



భీమునిపట్నం : భీమునిపట్నం క్రిష్ణాకోలని లోగల కే.జి.బి.వి పాఠశాలకు చెందిన విద్యార్థినిలకు ఈ నెల 10 న ఖమ్మంలో జరిగిన ఇరవయ్యవ నేషనల్ ఓపెన్ మార్ష ల్ ఆర్ట్ చాంపియన్ షిప్ 2017 కరాటే పోటీలలో వి.గాయత్రికి మొదటి బంగార పతకం , కె.హేమలతకు రెండవ రజత పతకం, బి.రంజిత, ఎం.ధర్మశ్రీలకు మూడవ కాంస్యపతకం వచ్చాయి అని కే.జి.బి.వి. పాఠశాల ప్రత్యేక అధికారిణి కె.గ్రేస్ లిల్లీ తెలిపారు. విద్యార్థినిలను పాఠశాల ప్రత్యాక అధికారిణి, ఉపాధ్యాయలు, కోచ్ వెంకటరమణ యాదవ్‌లు అభినందించారు.

# సాదా సీదాగా ప్రజావాణి

ఆలమూరు : స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం సాదాసీదాగా జరిగింది. ఈ కార్యక్రమంలో 5 అర్జీలు అందగా ఆలమూరు 10వవార్డులోని నివాసులు గోకవరపు నాగలక్ష్మి, అమరశ్రీ తదితరులు డ్రెయినేజీ నిర్మాణం కోరుతూ -1అర్జీ, మడికి నుండి వితంతు పెన్షను కోరుతూ-1, వృద్ధాప్య పెన్షను కోరుతూ-1, రెవిన్యూ శాఖకు సంబంధించి-1, అలాగే మూలస్థాన అగ్రహారం నుండి విద్యుత్ కనెక్షన్ శాంక్షను కొరకు -1 అందాయి. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ కె.పద్మావతి, కపిలేశ్వరపురం సిడిపిఓ బి.విజయశ్రీ, ఈఓపిఆర్‌డి పి.బొజ్జిరాజు, హౌసింగ్ ఏఈ ఎస్.జేజిబాబులు పలుశాఖల క్రిందస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలకు స్మార్ట్ ఫోన్‌లు పంపిణి



రావులపాలెం : కొత్తపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో రావులపాలెం మండలంలో గల 100 మందికి స్మార్ట్ ఫోన్‌లు అంగన్‌వాడీ కార్యకర్తలకు అందించారు. గోపాలపురంలో 50 మందికి, రావులపాలెంలో 50 మందికి స్మార్ట్ ఫోన్‌లు అందించినట్లు సిడిపిఓ శ్రీమతి బొత్స అనంతలక్ష్మి తెలిపారు. రావులపాలెంలో ఎమ్‌పిపి కోట చెల్లయ్య, గోపాలపురంలో సర్పంచ్ ఆనే లక్ష్మీ ముసలయ్య చేతులమీదుగా అందించారు. స్మార్ట్‌ఫోన్‌లలో అంగన్‌వాడీ సెంటర్ల సమాచారం, రియల్ టైమ్ డేటా, ఐసిడిఎస్ సేవలు మెరుగుపర్చడానికి, సమాచారం ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడానికి, మతా శిశు మరణాలను తగ్గించుటతో పాటు, పౌష్ఠికాహారాన్ని సకాలంలో అందించడానికి ఉపయోగపడుతుందని సూపర్‌వైజర్లు తెలిపారు. వీటిపై ఈ రోజు ప్రారంభమైన శిక్షణా తరగతులు నాలుగు రోజులపాటు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతుమూడి విజయలక్ష్మి, తహశీల్దారు సిహెచ్ ఉదయ భాస్కర్, కుడుపూడి శ్రీనివాస్, వానపల్లి త్రిమూర్తులు, మైగాపుల గురవయ్యనాయుడు, గొర్రెల పటేల్, సూపర్ వైజర్లు పి. క్రాంతికుమారి, ఎమ్. నిహారిక, ఐ. మాణిక్యం, అంగన్‌వాడీ కార్యకర్తలు, పి.ఆర్.కె. రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పోరాటానికి పల్లె నిద్ర

## - ఎమ్మెల్యే చిర్ల



ఆలమూరు : ప్రజా సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వంతో పోరాడటానికై వైయస్సార్‌సిపి అధినేత జగన్మోహనరెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర స్ఫూర్తితో గ్రామాలలో రచ్చబండ, పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండల పరిధి పెనికేరులో వైయస్సార్‌సిపి మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, గ్రామ కమిటీ నాయకులు, యర్రా శ్రీనివాసు, కాండ్రేగుల శ్రీనివాసుల ఆధ్వర్యంలో రచ్చబండ, పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్ల మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సమస్యలను గుర్తించేందుకు పార్టీ అధినేత జగన్ చేపట్టిన పాదయాత్రకు వస్తున్న అనూహ్య స్పందనకు టిడిపి శ్రేణులు బెంబేలెత్తుతున్నారన్నారు. పార్టీ ప్లీనరీలో జగన్ ప్రకటించిన విధంగా రాబోయే కాలంలో నవరత్నాల పథకాలను కులమత వర్గ విభేదాలకు తావులేకుండా నిష్పక్షపాతంగా అమలు చేస్తామన్నారు. రచ్చబండ, పల్లెనిద్రలో భాగంగా ఆయన గ్రామంలో ప్రతి వీధికి వెళ్ళి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడానికి బస్సు యాత్ర చేపడుతున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ముందుగా పెనికేరు గ్రామపార్టీ నేతలు ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని కొత్తూరు సెంటర్ నుండి మోటార్ సైకిల్ ర్యాలీతో తోడుకొని వచ్చారు. అనంతరం గ్రామంలో పలు ఏరియాలకు చెందిన వివిధ పార్టీల వారిని సుమారు 200 మందిని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. రాత్రి గ్రామంలోని శెట్టిబలిజ రామాలయం వద్ద పల్లెనిద్ర చేసారు. ఆయనతో పాటు గ్రామస్తులు జుత్తుగ శ్రీనివాసు, చవ్వాకుల శ్రీనివాసు, జి.సూర్యప్రకాశరావు, కొమ్ము చంద్రరావు తదితరులు పల్లె నిద్రలో పాల్గొనగా కార్యక్రమంలో రాష్ట్ర వైయస్సార్‌సిపి కార్యదర్శి కర్రి నాగిరెడ్డి, రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, గుణ్ణం రాంబాబు, దొమ్మేటి అర్జునరావు, కముజు సత్యనారాయణ, కోట చెల్లయ్య, బిసిసెల్ ప్రతినిధి యనమదల నాగేశ్వరావు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి నామాల శ్రీనివాసు, తోరాటి లక్ష్మణరావు, నల్లిరాజు, గంధం కామేశ్వరి, మోటిపల్లి వెంకన్న, చిరుకూరి సుబ్బారాయుడు, తాడి మెహెర్ ఆదిత్యారెడ్డి, ఎంపిటిసి ఏడిద మెహెర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం మండల అగ్రికల్చరల్ ఆఫీసరుగా బి. మీన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె రాజమహేంద్రవరం అగ్రికల్చరల్ ఆఫీసరుగా విధులు నిర్వహిస్తూ ప్రస్తుతం ఆఫీసరుగా రావులపాలెం వచ్చినట్లు ఆమె తెలిపారు.

# త్వరలో గోపాలపురం ర్యాంపు ప్రారంభం



రావులపాలెం : స్థానిక తహశీల్దారు కార్యాలయంలో సోమవారం గోపాలపురం ఇసుక ర్యాంపు నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దారు కొప్పిశెట్టి దుర్గారావు, ఎమ్‌పిడిఓ వై ఉమా మహేశ్వరరావు, ఎస్సై సిహెచ్ విద్యాసాగర్, ఎఇ ప్రసాదరావులు పాల్గొన్నారు. ఎఇ ప్రసాదరావు మట్లాడుతూ అమలాపురం ఆర్డీఓ ఆదేశాల మేరకు గోపాలపురం ఇసుక ర్యాంపు ప్రారంభించుటకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఒక యూనిట్ ట్రాక్టరుకు జట్టు కూలీలకు 175/- లు బాట నిర్వహణకు రూ.125/-, 2 యూనిట్ల లారీ లోడింగ్‌కు రూ.350/-, బాట నిర్వహణకు రూ.250/-, 3 యూనిట్ల లారీకి లోడింగ్‌కు రూ.500/- బాట నిర్వహణకు రూ.375/- లుగా ధరను ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈ రేట్లకు ఎవరైనా అతిక్రమించి వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. జట్టు సభ్యులే వారి స్వంత ఖర్చుతో బాట ఏర్పాటు చేసుకోవాలని గత సమావేశంలో తహశీల్దారు సూచనలమేరకు జట్టు మేస్త్రీలు అంగికరించడంతో బాట వారంరోజుల్లో నిర్మించుకోవాలని సూచించారు. ఎస్సై విద్యాసాగర్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై వ్యతిరేక దిశలో లారీలు నిలిపి ఉంచరాదని, నడపరాదని, ఇసుక లోడింగ్ అయిన తరువాత వాహనాలపై తప్పనిసరిగా బరకాలు కప్పాలని సూచించారు. వీటిని అతిక్రమించి లారీలు నడిపితే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచ్ ఆనే లక్ష్మిముసలయ్య, కార్యదర్శి ఎన్.ఎస్.ఆర్. గంగూలి, విఆర్ఓలు, జట్టు మేస్త్రీలు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# మంటలు ఆర్పడానికి వెళుతూ ట్రాఫిక్‌లో ఇరుక్కున్న ఫైర్ ఇంజన్



అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలో ఉన్న అరటి పండ్ల (రైతుబజార్) మార్కెట్‌లో అగ్నిప్రమాదం సంభవించిందన్న వార్తతో బయలు దేరిన ఫైరింజన్ జివిఎమ్‌సి కార్యాలయం ఎదురుగా వచ్చే సరికి ట్రాఫిక్‌లో జామ్‌లో ఇరుక్కున్న సంఘటన సంభవించింది. ఫైర్‌ఇంజన్ సిబ్బంది ఆర్న్ (సైరైన్) మ్రోగించినప్పటికి లాభంలేకపోయింది. సిబ్బంది ఎంత ప్రయత్నించిన ఎదుట ఉన్న వాహనాలు త్రోవ ఈయకపోవడంతో చేసేదిలేక మిన్నకున్నపోయారు. ట్రాఫిక్ సమస్యను ఎదుర్కోంటూ సంఘటనా స్థలానికి చేరుకునేసరికి సమయం ఎక్కువ తీసుకోవడంతో మంటలను స్థానికులే నియంత్రింకోవాల్సి వచ్చింది. సోమవారం ఉదయం సుమారు 11. 30 నిమిషాల సమయంలో అరటిపండ్ల మార్కెట్‌లో ఆవరణలో అరటి గెడలకు సంభందించిన గెడలు, అరటి తోక్కు వంటి వాటిని ఒకచోట పెద్ద కుప్పగా చేశారు. గుర్తుతెలియని వ్యక్తి కాల్చిన సిగరెట్ వేయడంతో మంటలు వ్యాపించినట్టు స్థానికులు చెప్పారు. ఎండిన తోక్కు కావడంతో మంటలు పెద్దవిగా వ్యాపించాయి.

స్థానికులు సకాలంలో స్పంధించి సమీపంలో హోటల్స్, సులాబ్ కాంప్లెక్సు నుండి నీటిని తీసుకువచ్చి మంటలుపై చల్లడంతో మంటలు పెద్దవి కాకుండా నియంత్రించే ప్రయాత్నాలు చేశారు. ఆనంతరం చేరుకున్న ఫైర్‌సిబ్బంది పూర్తిగా మంటలను ఆర్పివేశారు. స్థానికులు సకాలంలో రాకపోయినట్టయితే సమీపంలో చెక్క సామానులు తయారు చేసే షాపులు ఉన్నాయి వీటిలో చెక్క నిల్వలు ఉన్నాయి వాటికి మంటలు వ్యాపిస్తే ఆస్థి నష్టం ఎక్కువగా జరిగేదని స్థానికులు ఆంధోళన వ్యక్తం చేశారు. ఇన్‌చార్జ్ ఫైర్ అధికారి బి అప్పలనాయుడు, పి సత్యన్నారాయణ, బిపి సింహచలం, సిహెచ్ బంగారు రాజుతదితరులు పాల్గొన్నారు.

# వేములపూడి బిసి కాలనీకి సిమెంట్ రోడ్డు

## గ్రామానికి మరెన్ని సౌకర్యాలు: మాజీ సర్పంచ్ బోళెం



నర్సీపట్నం : వేములపూడి బిసి కాలనీలో సిమెంట్ రోడ్లు నిర్మాణానికి సోమవారం మాజీ సర్పంచ్ బోళెం నర్సింహమూర్తి శంకుస్థాపన చేశారు. గ్రామంలో మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధిని వేగవంతం చేస్తున్నామన్నారు. 3.40లక్షలతో రోడ్డునిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. పంచాయతీ పరిపాలానాధికారి సుబ్రహ్మణ్యం, గ్రామ నాయకులు రుత్తల నాయుడు, సిద్దా బత్తుల చంద్రరావు ఇంటి నుండి బంగారు, మహాలక్ష్మి ఇంటి వరకు 48 మీటర్లు వేస్తున్నారు. కాలనీ నాలుగు రోడ్ల శంకుస్థాపన చేశారు.

# ఆసుపత్రిలో సేవలు ఎక్కడెక్కడ అనే దానిపై అవగాహన

## ఏరియా ఆసుపత్రి సూపరిండెంటెంట్ సుధాశారద




నర్సీపట్నం : ఏరియా ఆసుపత్రిలో సేవలు ఎక్కడ ఎక్కడ అందుతున్నాయనే విషయాలు ప్రజలకు మరింత అవగాహన పెంచేందుకు కృషి చేస్తున్నామని ఏరియా ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ సుధాశారదా అన్నారు. అందులో భాగంగానే ప్రతీ వార్డుకు, ప్రతీ దారికి సంబంధించి మరింత విస్తృతమైన బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.

సిబ్బంది ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. ఎవరిని అడగకుండా తమ గమ్యాన్ని చేరుకునే విధంగా రోగులకు, రోగులు చూడటానికి వచ్చేవారికి సులువుగా ఉండేందుకు మరెన్ని బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

# సిటీ పబ్లిక్ స్కూల్ బాధితులను ఆదుకున్న ఎమ్మెల్యే పీలా



అనకాపల్లి : అనకాపల్లికి చెందిన సిటీపబ్లిక్ స్కూల్ విద్యార్థులు విహార యాత్రకు శనివారం వెళ్లిడం, బస్ బ్రేకులు పనిచేయకపోడంతో ప్రమాదం సంభవించి సుమారు 70 మంది విద్యార్థులకు గాయాలయాలు పాలుకావడం తెలిసిందే. వీరిలో కొందరు విద్యార్థులను అనకాపల్లి ఏరియా అసుపత్రికి తరలించడం జరిగింది. బాధిత విద్యార్థులను స్థానిక ఎమ్ఎల్ఏ పీలా గోవింద సత్యన్నారాయణ బాధితులను పరామర్శించి, ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి వారికి కావలసిన పరీక్షలు నిర్వహించి, భోజనాలు, మందులు ఉచితంగా అందించారు. ఈ సందర్భముగా ఆసుపత్రిలో ఉన్న స్థానికులు సిటీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం సరిగా పట్టించుకోకపోయిన స్థానిక ఎమ్ఎల్ఏ పీలా పట్టించుకుని సేవలు చేయడంపై పలువురు అభినందించారు.

# ఘనంగా మరిడిమాంబ పండుగ

అనకాపల్లి : మండలంలో వెంకుపాలెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ మరిడిమాంబ అమ్మవారి మండల మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఆడారి అనురాధ, ఆడారి సూరిఅప్పారావు, ఎంపిటీసీ రాపేరి రాము, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రికి శ్రీ సరస్వతి కళానాట్యమండలి వారిచే రాణా ప్రతాప్ అనే సాంఘిక నాటకం ప్రదర్శించారు. ఈ నాటిక ప్రజలను ఆకట్టుకుంది.

# సరళమైన భాషలో భావ ప్రకటనా సామర్థ్యం పెంచుకోవాలి

## టెక్నికల్ రైటింగ్ వర్క్‌షాప్‌లో గీతం ఛాన్సలర్




విశాఖపట్నం : ప్రతి ఒక్కరికి అర్థం అయ్యే విధంగా సరళమైన భాషలో భావ వ్యక్తీకరణ జరిగినప్పుడే వృత్తిలో రాణించవచ్చునని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.రామకృష్ణారావు పేర్కొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ గాంధియన్ స్టడీస్ సెంటర్ ఫర్ లాంగ్వేజస్ ఆధ్వర్యంలో ఎఫెక్టివ్ టెక్నికల్ రైటింగ్ పై ఏర్పాటు చేసిన కార్యశాలను సోమవారం ఆయన ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంభించారు. భాషను ప్రజలకు అర్థం అయ్యే విధంగా సూటిగా, సంక్షిప్త పదాలతో గాంధీ మహాత్ముని మించిన వారు లేరని ఆయన పేర్కొన్నారు. ఆంగ్లంలో, హిందీలో గాంధీ వెలువరించిన ఉత్తరాలు, సంపాదకీయాలు, పుస్తకాలు భావ వ్యక్తీకరణ ఎంతగా హత్తుకునేలా చేయవచ్చో తెలియజెబు తాయన్నారు. తాను త్వరలో వెలువరించనున్న పతంజలి యోగ సూత్రాలు, భగవద్గీత వ్యాఖ్యానంలో గాంధీని అనుసరించినట్లు ప్రొఫెసర్ రామకృష్ణారావు తెలిపారు.

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్.ఎస్.ప్రసాదరావు మాట్లాడుతూ గంభీరమైన పదాలు, విశేషణాలతో కంటే సరళమైన భాషా ప్రయోగం ద్వారానే ఎక్కువ మందికి చేరవచ్చునన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రొ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ మాట్లాడుతూ ఐటి రంగంలో సాంకేతిక పదజాలానికి, స్పష్టతకు ప్రాధాన్యత ఉంటుందని టెక్నికల్ ఇంగ్లీష్ రైటింగ్ నిపుణులకు డిమాండ్ పెరుగుతోందన్నారు. మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్ వంటి వృత్తి విద్యలలో భాషకు గల ప్రాధాన్యత దృష్ట్యా టెక్నికల్ రైటింగ్ పై పూర్తి స్థాయిలో కోర్సు ప్రారంభించాలన్నారు. కార్యక్రమానికి గీతం స్కూల్ ఆఫ్ గాంధియన్ స్టడీస్ ఇన్‌ఛార్జి డైరక్టర్ డాక్టర్ రోజిట్టా జోసెఫ్ అధ్యక్షత వహించారు. ఐటి పరిశ్రమలలో టెక్నికల్ రైటర్స్‌గా అనుభవం పొందిన నీరజ నెల్లిమర్ల, జితేంద్ర శివమణి రిసోర్స్ పర్సన్‌లుగా హాజరయ్యారు.

# గ్రీవెన్స్ ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

## ఆర్డీవో సూర్యారావు



నర్సీపట్నం : గ్రీవెన్స్‌లో వచ్చే ఫిర్యాదులను తక్షణమే అధికారులు స్పందించి పరిష్కరించాలని నర్సీపట్నం ఆర్డీవో కోరాడ సూర్యారావు అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఏఒ ప్రకాశరావు ఉన్నారు.

# రైతుల అభీష్టం మేరకే తాండవ నీరు నిలిపివేత

నాతవరం : రైతుల అభీష్టం మేరకు తాండవ జలాశయం నీరు సరఫరాను సోమవారం నిలిపివేసినట్లు తాండవ డిఈ రాజేంద్రకుమార్ తెలిపారు.

ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ వరి కోత దశలో చేరుకోవడంతో నీటిని నిలుపుదల చేశామన్నారు. ఆగస్టు 16న కాలువల ద్వారా నీటిని విడుదల చేశామని, రెండు కాలువల ద్వారా రోజుకు 650 క్యూసెక్కులు ఆయకట్టుకు, 35 క్యూసెక్కులు తాండవ నదిలోకి విడుదల చేశామన్నారు.

ప్రస్తుతం జలాశయ నీటిమట్టం 363.5 అడుగుల మేర నీరు ఉందన్నారు.


గత ఏడాది ఇదే సమయానికి తాండవలో 360 అడుగులు మాత్రమే ఉండేదన్నారు. నిబంధనల ప్రకారం ఖరీఫ్ ఆయకట్టుకు 120 రోజుల పాటు తాండవ నీరు ఇవ్వాల్సి ఉందన్నారు.

సోమవారం నాటికి ఆయకట్టురైతులకు 122 రోజులు నీరు విడుదల చేశామన్నారు.

# టిటిడి సేవ కార్యక్రమాలపై అవగాహన

కొయ్యూరు : మండలంలోని లూసం గ్రామంలో సమర సేవా పౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్.సన్యాసిరావు, ఎల్.శివయ్య, ఆర్.పరమేశ్వరరావు గ్రామస్థులతో కలిసి గ్రామాల్లో టిటిడి దేవస్థానం ద్వారా గ్రామాల్లో చేసే సేవా కార్యక్రమాల కోసం వివరించారు.


అనంతరం దొడ్డవరం నుండి లూసం వరకు పాదయాత్ర చేశారు. ఈకార్యక్రమంలో లూసం గ్రామస్థులు, గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# కానిస్టేబుల్ శ్రీనివాసరావుకు ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ అభినందనలు



విశాఖపట్నం : విశాఖ జిల్లాలో తమ విధులు నిర్వహిస్తూ ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి, పని వత్తిడిని అధిగమించి కానిస్టేబుల్ శ్రీనివాసరావు శరీర సౌష్టవ పోటీలకు రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించడం ఎంతైనా అభినందించదగ్గ విషయమని జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ పేర్కొన్నారు. సోమవారం ఎస్పీ తమ కార్యాలయంలో కానిస్టేబుల్‌ను అభినందిస్తూ 16వ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ 2017లో 85కేజీల విభాగంలో మొదటి స్థానం సాధించి రికార్డు నెలకొల్పాడు కానిస్టేబుల్ జి. శ్రీనివాసరావు. ఈ పోటీలు శ్రీకాకుళం జిల్లా ఎన్‌టిఆర్ ఎంహెచ్ స్కూల్ ప్రాంగణంలో జరిగాయి. ఈ పోటీలో మొత్తం 120 మంది వివిధ విభాగాలనుంచి పాల్గొన్నారు. జి. శ్రీనివాసరావు 2016లో ఇండియన్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్, కేరళలో నిర్వహించిన సీనియర్ నేషనల్స్ పోటీలలో 85 కేజీల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించి 'ఏషియన్ బాడీబిల్డింగ్ అండ్ ఫిట్‌నెస్ ఛాంపియన్‌షిప్ బ్యాంకాక్, థాయిలాండ్‌లో ఈ సంవత్సరం డిసెంబర్ 17 నుంచి 19 వరకు జరుగు పోటలకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఇతను ఒక్కడే ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్, డిజీపీ నండూరి సాంబశివరావు ఐపిఎస్., మరియు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ఐపిఎస్., వారి చొరవతో రాష్ట్ర పోలీసు విభాగం నుంచి ఇతనికి ఆర్థిక సహాయంగా 2.50 లక్షల రూపాయల నగదును అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ త్వరలో బ్యాంకాక్, థాయిలాండ్‌లో జగనున్న బాడీ బిల్డింగ్ పోటీలలో కూడా ప్రతిభను కనబరిచి ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలను పంచాయతీకి అనుసంధానం చేస్తే ఊరుకోం

కొయ్యూరు : అంగన్వాడీ కేంద్రాలను పంచాయతీలకు అనుసంధానం చేయాలనే ఆదేశాలను ఉపసంహరించుకోవాలని సిపిఎం పార్టీ నాయకులు అప్పలనాయుడు, సూరిబాబు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అంగన్వాడీలు భారీ ఎత్తున ఆందోళన చేశారు.

ఈ సందర్భంగా అప్పలనాయుడు, సూరిబాబులు మాట్లాడుతూ అంగన్వాడీలను పంచాయతీలకు అనుసంధానం చేసే ఆదేశాలను ఉపసంహరించుకోవాలన్నారు. పెండింగ్ వేతనాలు, ఇంటి అద్దెలు, ట్రాన్స్‌పోర్టు చార్జీలు, డిఎ బిల్స్ వెంటనే చెల్లించాలన్నారు.

అంగన్వాడీ అకౌంట్‌లోనే కూరగాయల బిల్లులు వేయాలన్నారు. లింక్, క్రెచ్ వర్కర్లకు ఫిబ్రవరి నెల నుండి ఉన్న పెండింగ్ వేతన బకాయిలను విడుదల చేయాలని, ఖాళీ పోస్టుల్లో వీరికి ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అభిమానులకు 'పొట్టి' క్రికెట్ పండగ!

- కొత్త ఎఫ్‌టీపీలో మూడు రెట్లు ఎక్కువ మ్యాచ్‌లు
- 54 టీ20లు ..
- పదివేల కోట్ల ఆదాయంపై బీసీసీఐ దృష్టి



హైదరాబాద్: క్రికెట్ అభిమానులకు ఇక పండగే! రానున్న కాలంలో కోహ్లీసేన మరిన్ని టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. క్రికెట్ ప్రేమికులను పరుగుల వరదలో తడిపేయనుంది. ప్రస్తుత ఫ్యూచర్ టూర్ ప్రోగ్రామ్ (ఎఫ్‌టీపీ)తో పోలిస్తే 2019-2023 ఎఫ్‌టీపీ ప్రకారం టీమిండియా మూడు రెట్లు ఎక్కువగా పొట్టి క్రికెట్ ఆడనుందని సమాచారం.

**54 టీ20లు ..**

ఇంతకు ముందు ఎఫ్‌టీపీలో టీమిండియా 36 టెస్టులు, 73 వన్డేలు, 18 టీ20లు మొత్తం కలిపి 127 మ్యాచ్‌లు ఆడింది. ఇక కొత్త ఎఫ్‌టీపీ ప్రకారం 37 టెస్టులు, 67 వన్డేలు, 54 టీ20లు మొత్తం 158 మ్యాచ లు ఆడాల్సి ఉంటుంది. ఐతే తీరికలేని షెడ్యూలు వల్ల ఇప్పటికే తమకు విశ్రాంతి దొరకడం లేదని సరైన సన్నద్ధత ఉండటం లేదని మొత్తుకుంటున్నారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు రాకుండా చూడాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం జరిగే బీసీసీఐ ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో జనరల్‌బాడీ కొత్త ఎఫ్‌టీపీ గురించి చర్చించనుంది.

**పదివేల కోట్ల ఆదాయం ..**

బీసీసీఐ ఆర్థిక నమూనాను దృష్టిలో పెట్టుకొని కొత్త ఎఫ్‌టీపీపై చర్చిస్తారని ఆయా వర్గాల సమాచారం. అలాగే ఆటగాళ్ల పని ఒత్తిడి గురించీ మాట్లాడతారని తెలుస్తోంది. ఆటగాళ్లు ఎక్కువ ఆర్జించాలంటే అధికంగా పని ఒత్తిడి భరించాల్సిందేనని బీసీసీఐ వర్గాలు అంటున్నాయి. ఐతే రొటేషన్ పద్ధతిలో పని భారాన్ని తప్పించే అవకాశం ఉంది.

ఇప్పటికే 2018-2023 ఐపీఎల్ ప్రసార హక్కుల ద్వారా బీసీసీఐకి రూ.16,347 కోట్లు లభించాయి. వచ్చే ఏడాది కొత్త ఎఫ్‌టీపీ మ్యాచ్‌ల ప్రసార హక్కుల విక్రయం ద్వారా బోర్డు మరో 10,000 కోట్ల సంపాదనపై దృష్టి పెట్టిందని తెలుస్తోంది. ప్రస్తుతం స్వదేశంలో టీమిండియా ఆడే టీ20 ద్వారా రూ.40 కోట్ల ఆదాయం వస్తుంటే అందులో టీవీ ఛానల్‌కు దాదాపు రూ.20 కోట్లు లభిస్తున్నాయి.

బీసీసీఐ ఇక కొత్త ఎఫ్‌టీపీలో ఎక్కువ మ్యాచ్‌లకు ఆమోదం తెలిపితే అటు బోర్డుకు ఇటు ఛానళ్లకు డబ్బుల పండగే! అభిమానులకేమో కనుల పండగ!

### కోహ్లి ప్రతిపాదనకు

# బీసీసీఐ ఓకే



న్యూఢిల్లీ : తీరిక లేని మ్యాచ్‌లతో ఆటగాళ్లపై తీవ్ర ఒత్తిడి నెలకొంటుందని, బీజీ షెడ్యూల్‌పై పునరాలోచించాలని ఇటీవల టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి చేసిన ప్రతిపాదనను బీసీసీఐ పరిగణలోకి తీసుకుంది. బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా నేతృత్వంలో సోమవారం జరిగిన సమావేశంలో మ్యాచ్‌లు ఆడే రోజులను తగ్గిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఫ్యూచర్ టూర్స్ ప్రోగ్రామ్( ఎఫ్‌టీపీ) మ్యాచ్‌లు ఆడే రోజులను తగ్గించారు. 2019 నుంచి 2023 మధ్య 390 రోజులు ఆడాల్సి ఉండగా ఈ సంఖ్యను 306 రోజులకు తగ్గించారు. ఈ ప్రణాళికలో 2021 చాంపియన్స్ ట్రోఫీ, 2023 ప్రపంచకప్ మ్యాచ్‌లను లెక్కించలేదు. ఈ టోర్నీల్లో టీమిండియా ఆడే మ్యాచ్‌లను కలిపినా ఈ సంఖ్య 350కు మించదు. అయితే ప్రస్తుత ఎఫ్‌టీపీతో పోలిస్తే 2019-2023 ఎఫ్‌టీపీ ప్రకారం టీమిండియా మూడు రెట్లు ఎక్కువగా టీ20లు ఆడనుందని సమాచారం. ఈ మధ్యకాలంలో భారత్ 50 శాతం మ్యాచ్‌లను పెద్ద జట్లైన ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, సౌతాఫ్రికాలతో ఆడింది.

## కైలాసగిరిపై మళ్లీ చిరుతల కలకలం



విశాఖపట్నం : విశాఖ్లోని కైలాసగిరిపై రెండు రోజుల క్రితం సంచరించిన చిరుతలు మరోసారి కనిపించాయంటూ వదంతులు వ్యాపించారు. సోమవారం సాయంత్రం కైలాసగిరి కొండ దిగువ వుడా ఆరోగ్య ప్రాంగణం వద్ద ఉన్న బుద్ధుడి విగ్రహం వెనుక పులులు సంచరిస్తున్నట్లుగా వదంతులు రావడంతో వుడా అధికారులు అప్రమత్తమయ్యారు. అయితే కైలాసగిరి కొండపై సెన్సార్ కెమెరాలు ఏర్పాటు చేయగా అందులో రెండు ముళ్ల పందులు, ఇతరత్రా జంతువులు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. కైలాసగిరిపై అత్యధిక సంఖ్యలో కుక్కలు ఉన్నట్లు కూడా కెమెరాల ఆధారంగా తెలుసుకున్నారు. చిరుతలు ఉన్నాయా? లేదా? అనే విషయంపై పూర్తిస్థాయిలో నిర్ధారణకు వచ్చిన తర్వాతనే కైలాసగిరి కొండపైకి అనుమతులు అంగీకరిస్తామని వుడా అధికారులు స్పష్టం చేశారు.

## ఢిల్లీని సెమీస్ చేర్చిన గౌతమ్ గంభీర్

న్యూఢిల్లీః భారత వెటరన్ ఓపెనర్ గౌతమ్ గంభీర్ మరోసారి తన మార్క్ ఇన్నింగ్స్‌తో అందరినీ ఆకర్షించాడు. రంజీ ట్రోఫీలో భాగంగా మధ్యప్రదేశ్‌తో సోమవారం ముగిసిన రెండో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో గౌతమ్ గంభీర్ (95: 129 బంతుల్లో 9ఇ4, 1ఇ6) కీలక ఇన్నింగ్స్ ఆడటంతో ఢిల్లీ 7 వికెట్ల తేడాతో గెలుపొంది సెమీ ఫైనల్‌లో బెర్తు ఖాయం చేసుకుంది. 2009-10 సీజన్ తర్వాత.. ఈ టోర్నీలో ఢిల్లీ సెమీస్ చేరడం ఇదే తొలిసారి.

217 పరుగుల లక్ష్య ఛేదనలో ఢిల్లీ ఓపెనర్ వికాస్ (6) నిరాశపరిచినా.. మరో ఓపెనర్ కునాల్ చండేలా (57)తో కలిసి గంభీర్ సమయోచిత ఇన్నింగ్స్ ఆడాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కి 98 పరుగుల అభేధ్య భాగస్వామ్యం నెలకొల్పడంతో ఢిల్లీ గెలుపు దాదాపు ఖాయమైంది. శతకానికి చేరువలో గంభీర్ రనౌట్‌గా వెనుదిరిగినా.. చివర్లో నితీశ్ రాణా (6 నాటౌట్: 6 బంతుల్లో 1ఇ6) గెలుపు లాంఛనాన్ని పూర్తి చేశాడు. డిసెంబరు 17న తొలి సెమీ ఫైనల్ మ్యాచ్‌లో గుజరాత్ లేదా బెంగాల్ జట్టుతో ఢిల్లీ తలపడనుంది.

## ఆరంభం నుంచి లాభాల్లోనే..

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్లు నేడు లాభాల్లో ముగిశాయి. మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో సూచీలు సోమవారం కళకళలాడాయి. కొన్ని కంపెనీల షేర్లు లాభాల్లో ట్రేడవడం కలిసొచ్చింది. బీఎస్ఈ సెన్సెక్స్ ఉదయం 33,317.72 వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 33,539.97 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 205.49 పాయింట్ల లాభంతో 33,455.79 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఇదే దారిలో నడిచింది. ఉదయం 10,310.50 వద్ద ప్రారంభమై ఇంట్రాడేలో 10,329.20 వద్ద గరిష్ఠాన్ని తాకింది. 56.60 పాయింట్ల లాభంతో 10,322.25 వద్ద ముగిసింది. పాల ఉత్పత్తుల సంస్థ ప్రభాత్ డైరీ షేరు సోమవారం నాటి ట్రేడింగ్‌లో 20 శాతం లాభపడింది. ఒక్కరోజే రూ.35 పెరిగి 210 వద్ద స్థిరపడింది. గత ఐదు సెషన్ల నుంచి కొనుగోళ్లు జోరందుకున్నాయి. నిఫ్టీలో 33 కంపెనీలు లాభాల్లో 17 నష్టాల్లో ముగిశాయి. అరబిందో ఫార్మా, టీసీఎస్, యూపీఎల్, ఎంఅండ్ఎం, లుపిన్ దాదాపు 2-3 శాతం లాభపడ్డాయి. ఇన్ఫ్రాటెల్, ఎన్‌టీపీసీ, ఏసియన్ పెయింట్, యెస్‌బ్యాంక్, ఓఎన్‌జీసీ 0.55-2 శాతం మేర నష్టపోయాయి.

# 15, 16 తేదీల్లో గీతం ఎక్స్‌లెన్స్ మీట్

- విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికితీతకే 'జెమ్'
- రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7వేల మంది విద్యార్థుల హాజరుకానున్నారు
- ముఖ్య అతిధులుగా సినీతారల హాజరు
- జెమ్ కన్వీనర్ డా.. వరప్రసాద్




సాగర్‌నగర్ : అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (గీతం) యూనివర్శిటీ వేదికగా గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీలలో గీతం ఎక్స్‌లెన్స్ మీట్ ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నట్లు జెమ్ కన్వీనర్ డాక్టర్ వైవివిఎస్ఎస్ వరప్రసాద్ తెలియజేశారు. జెమ్-2017 వివరాలు తెలియపర్చేందుకు సోమవారం స్థానిక హెూటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ మేనజ్‌మెంట్ విద్యార్థినీ విద్యార్థులలో చదువుతో పాటు వివిధ రంగాలలో వారికి గల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఈ జెమ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ఇందులో నాలుగు విభాగాలు కలిగి ఉన్నాయని హెచ్‌ఆర్ - ఫుడ్, అకామిడేషన్, ట్రాన్స్‌పోర్ట్, ఫైనాన్స్‌లో ఫండ్ కలెక్షన్, ఖర్చులు, మార్కెటింగ్ - సేల్స్, ఆపరేషన్స్ - ఈవెంట్స్, ఇతరత్రా వ్యవహారాలు చూసుకుంటారన్నారు. ఈ జెమ్ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుండి ఉన్నత యూనివర్శిటీల నుంచి సుమారు 6 నుంచి 7 వేల మంది విద్యార్థినీవిద్యార్థులు, 15000 మంది పైచిలుకు వీక్షకులు హాజరౌతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఈ నెల 15వ తారీఖున ప్రముఖ సినీ హీరో అల్లు శిరీష్‌తోపాటు ఒక్క క్షణం ఫేమ్ టీం హాజరౌతారు. 16వ తేదీన మెంటల్ మదిలో ఫేమ్ శ్రీవిష్ణు (శ్రీ విష్ణు, గీతం స్టూడెంట్) తోపాటు ప్రముఖ సినీ మ్యూజికల్ డైరెక్టర్ ఎంఎం శ్రీలేఖ హాజరై యువతను మరింత ఉత్సాహపరుస్తారని ఆయన తెలియజేశారు. ఈ జెమ్‌లో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు వివిధ రంగాలకు చెందిన క్రీడలుకూడా నిర్వహిస్తున్నామని తెలియజేశారు.

ఈ పోటీలలో గెలుపొందిన వారికి నగదు బహుమతిగా సుమారు లక్ష రూపాయలు వరకు అందజేస్తామని అన్నారు. ఇప్పటికే ఈ జెమ్ ప్రసార కార్యక్రమాలలో భాగంగా ఈ నెల 9న సీఎంఆర్ సెంటర్‌లో, 10న వైఎంసిఏ బీచ్ రోడ్డులో విద్యార్థినీ విద్యార్థులతో ఫ్లాస్‌మబ్ నిర్వహించామని ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించిందని తెలియజేశారు.



ఈ నెల 14న గీతం ప్రాంగణంలో నిర్వహిస్తామని తెలియజేశారు. ప్రతీ సంవత్సరం జెమ్ పేరుతో జెమ్ కార్యక్రమాలు 18 సంవత్సరాలు పూర్తిచేశామని, 2017లో జరుగుతున్న 19వ జెమ్‌కు ప్రతీ ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని వరప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ యు. ఆదినారాయణ, జెమ్ చైర్మన్ పి. షీలా, కో-కన్వీనర్ డాక్టర్ పి. ఆశ, స్టూడెంట్స్ సిఇఓ వి. స్టాన్లీ ఎమరాల్డ్, డిప్యూటీ సీఈవో (ఫైనాన్స్) కె. రవిచంద్, డిప్యూటీ సీఈవో (మార్కెటింగ్) ఆకాంక్ష, డిప్యూటీ సీఈవో (హెచ్ఆర్) సిహెచ్‌వివిఎస్ కృష్ణ కిరీటి, డిప్యూటీ సీఈవో (ఆపరేషన్స్) కె.నిఖిల్ విజయేంద్ర, కంపెనీ సెక్రటరీ నిషిత, రాకేష్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

# 13న దిశ సమీక్షా సమావేశం

విశాఖపట్నం : ఈ నెల 13వ తేదీన అరకు పార్లమెంటు సభ్యురాలి అధ్యక్షతన దిశ సమీక్షా సమావేశం నిర్వహించబడుతుందని సంబంధిత అధికార్లు తమ శాఖల నివేదికలతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ అధికార్లను కోరారు.

సోమవారం జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో అధికార్లను సమీక్షా సమావేశాలపై ఆదేశాలిచ్చారు. నెల 23న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నేతృత్వంలో జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం నిర్వహించబ డుతుందని, జిల్లాలోని అన్ని శాఖల అధికార్లు తమ తమ శాఖల నివేదికలతో రావాలని, ముందు తాను ఒకసారి శాఖల వారీగా సమీక్షిస్తానన్నారు.

ప్రధాన శాఖలు తమ శాఖల ప్రగతిని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని జిల్లా ప్రగతికి సంబంధించిన పూర్తి వివరాలతో అధికార్లు సర్వసన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.






## క్రీడాకారులకు వసతులు కల్పించండి : మోదీకి సచిన్ లేఖ

న్యూఢిల్లీ: అంతర్జాతీయ క్రీడా పతక విజేతలను కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకంలో (సీజీహెస్ఎస్) చేర్చాలని సచిన్ టెండూల్కర్ ప్రధాని మోదీని కోరారు. క్రీడాకారులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను తెలుపుతూ ఆయన మోదీకి లేఖ రాశారు. ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించిన హాకీ క్రీడాకారుడు మహ్మద్ షాహిద్ చివరి రోజులను గుర్తు చేశారు. సీజీహెచ్ఎస్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వైద్య సేవలు అందిస్తున్న సంగతి తెలిసిందే.అంతర్జాతీయంగా పతకాలు గెలిచిన వారందరికీ సీజీహెచ్‌సీ సదుపాయాలు కల్పించాలని ఓ క్రీడాకారుడిగా దేశంలోని అందరు క్రీడాకారుల తరపున కోరుతున్నాను. కేంద్ర ఆరోగ్య మంత్రికి ఈ విషయం గురించి చెప్పా. ఆయన మద్దతు పలికారు. కానీ విస్తృత శ్రేణిలో క్రీడాకారులను ఈ పథకం కింద తీసుకోలేమని తెలిపారు. వారి పరిస్థితిని అర్థం చేసుకున్నా అని ఆయన లేఖలో పేర్కొన్నారు. కనీసం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు లేని అంతర్జాతీయ పతక విజేతలను ఈ పథకంలో చేర్చమని సచిన్ కోరారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com